ప్రజాశక్తి

గురువారం 27 జూన్ 2024 8 పేజీలు

ఎన్‌టిఆర్

కృష్ణా

బాధ్యతలు స్వీకరిస్తున్న నూతన కలెక్టర్ సృజన; శుభాకాంక్షలు తెలుపుతున్న జెసి సంపత్‌కుమార్

నూతన కలెక్టర్ సృజన బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - విజయవాడ : ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో జిల్లా సమగ్రాభివద్ధికి కృషిచేస్తానని ఎన్‌టిఆర్ జిల్లా నూతన కలెక్టర్ డాక్టర్ గుమ్మళ్ల సృజన అన్నారు. బుధవారం ఉదయం కలెక్టరేట్‌లోని ఛాంబర్‌లో ఆమె జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం వేద పండితుల ఆశీర్వచనం తీసుకున్న అనంతరం కలెక్టర్‌కు కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, జాయింట్ కలెక్టర్ పి.సంపత్ కుమార్, విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, డీఆర్‌వో వి.శ్రీనివాసరావు, విజయవాడ ఆర్‌డీవో బీహెచ్ భవానీ శంకర్, కలెక్టరేట్‌లోని వివిధ సెక్షన్ల అధికారులు, వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారులు శు భాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా కలెక్టర్ సృజన మాట్లాడుతూ 2015-16లో విజయవాడలో సబ్‌కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తించానని, మళ్లీ ఇక్కడే కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించడ చాలా ఆనందంగా ఉందని అన్నారు. అనంతరం ఆమె కలెక్టరేట్‌లోని వివిధ విభాగాలను పరిశీలించారు. వివిధ శాఖల అధికారులు వివిధ ఉద్యోగ సంఘాల నేతలు తదితరులు కలెక్టర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

వీడని అతిసార

కొత్తగా 8 కేసులు నమోదు

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : ఎవరైనా వాంతులు, విరోచనాలతో బాధపడితే వెంటనే సమీపంలో గల వైద్య శిబిరాలకు రావాలని ఎన్‌టిఆర్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి ఎం.సుహాసిని సూచించారు. ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట నియోజకవర్గంలో అతిసార కేసులు ఇంకా నమోదవుతూనే ఉన్నాయి. కొత్తగా ఎనిమిది మంది వ్యాధిబారిన పడ్డారు. బుధవారం జగ్గయ్యపేట ప్రభుత్వాస్పత్రిలో ఆరుగురు, జగ్గయ్యపేట మండలం షేర్ మమ్మద్‌పేట గ్రామ మండల పరిషత్ పాఠశాలలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో ఇద్దరు బాధితులు చేరారు. జగ్గయ్యపేట పట్టణానికి చెందిన జగదీష్ నబరంగ్ పూరియా, యాంపొంగు తిరుపతమ్మ, మేకలబోయిన ప్రశాంత్, వత్సవాయి మండలం మంగోల్లుకు చెందిన షేక్ నూర్జాన్ బీ, దారెల్లి వెంకటేశ్వర్లు, ధర్మవరప్పాడు తండా గ్రామానికి చెందిన భూక్య పూరామణి జగ్గయ్యపేట ప్రభుత్వాస్పత్రిలో, జగ్గయ్యపేట మండలం షేర్ మమ్మద్ పేట గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో సిమ్మసర్తి నాగలక్ష్మి, కాకనబోయిన విశ్వా కొత్తగా చేరిన వారిలో ఉన్నారు. దీంతో నియోజకవర్గంలో మొత్తం అతిసార బాధితుల సంఖ్య 112కి చేరింది. వీరిలో 88 మంది చికిత్స పొంది ఆస్పత్రుల నుండి డిశ్చార్జికాగా, విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో 18 మంది, జగ్గయ్యపేట ప్రభుత్వాస్పత్రిలో ఆరుగురు, షేర్ మహ్మద్‌పేట వైద్య శిబిరంలో ఇద్దరు చికిత్స పొందుతున్నారు. నియోజకవర్గంలోని చిల్లకల్లు, మక్కపేట, షేర్ మహ్మద్‌పేట గ్రామాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక వైద్య శిబిరాలను జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి ఎం.సుహాసిని పర్యవేక్షిస్తున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైద్య సిబ్బంది (మిగతా 2లో)

జగ్గయ్యపేట ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న అతిసార బాధితులు

బూచవరం పిహెచ్‌సిలో బాధితులను పరామర్శిస్తున్న సిపిఎం నాయకులు సోమోజు నాగమణి తదితరులు

చర్చ నిల్

- అన్ని అంశాలు ఆమోదం
- అధికారుల్లో గందరగోళం
- ఎంఎల్‌ఎ వెలంపల్లి అంటూ రోడ్డుకు ఆమోదం
- విఎంసిలో అధికార, ప్రతిపక్షాల మధ్య రగడ

స్థాయీ సంఘ సమావేశం దృశ్యం

ప్రజాశక్తి - విజయవాడ : ఎటువంటి చర్చకు తావులేకుండానే స్థాయీ సంఘంలోని అన్ని అంశాలూ ఆమోదం పొందాయి. నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి అధ్యక్షతన బుధవారం కమాండ్ కంట్రోల్‌రూమ్‌లో విజయవాడ నగర పాలక సంస్థ స్థాయీ సంఘం సమావేశం జరిగింది. ఈ సమావేశంలో 11 అంశాల ఎజెండాపై మచ్చుకైనా చర్చ జరగలేదని తెలిసింది. అంతా ఏకపక్షంగానే సభ్యులు ఆమోదించేసుకున్నట్లు తెలిసింది. అధికారులు కూడా రాజకీయ వత్తిడుల మధ్య ఒప్పుకోక తప్పలేదని విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఇటీవల ఎన్నికల్లో ఓటమిపాలైన మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాస్‌ను అధికారులు ప్రస్తుతం వారి లెక్కల్లో ఎంఎల్‌ఎను చేసేశారు. పశ్చిమ ఎంఎల్‌ఎ సుజనా చౌదరి కాగా, ఎంఎల్‌ఎ వెలంపల్లి ఆదేశాల మేరకు రూ.29.94 లక్షల అంచనా విలువతో బిటి రోడ్డు నిర్మాణం 4వ అంశంగా సెక్రటరీ సెల్ అధికారులు అజెండాలోకి తీసుకువచ్చారు. అంతేగాక దీనిని ఏకంగా ఆమోదించడం పట్ల అటు అధికార, విపక్షాల్లో సైతం పెద్ద దుమారం రేగింది. ఇటువంటి వివాదాస్పద అంశం విషయంలో రాజకీయ వత్తిడులతో అధికారుల పరిస్థితి అడకత్తెరలో పోక చెక్క మాదిరిగా తయారైంది. రూ.29.94 లక్షల అంచనా విలువతో 43వ డివిజన్‌లోని హెచ్‌ఆర్‌టి అపార్టుమెంట్ వెనుక క్రాస్ రోడ్డులో బిటి రోడ్డు నిర్మించాలని ఎంఎల్‌ఎ వెలంపల్లి ఆదేశాల మేరకు అంటూ తీసుకొచ్చిన ఈ అంశాన్ని ఎటువంటి చర్చ లేకుండానే స్థాయి సంఘం ఆమోదించేసింది. ఈ నిధులను జనరల్ ఫండ్ నుంచి చెల్లించే విధంగా తీర్మానించారు. ఇటువంటి వివాదాస్పద అంశాన్ని స్థాయి సంఘం అజెండాలోకి ఎలా తీసుకొచ్చారని, దీని వెనుకాల ఎవరున్నారని, దీని విషయాన్ని తేల్చాల్సిందేనని టిడిపి ఫ్లోర్‌లీడర్ నెలిబండ్ల బాలస్వామి సెక్రటరీ సెల్ అధికారితో ఫోన్‌లో మాట్లాడినట్లు తెలిసింది. తనకేమి తెలియదని, తనను దీనిలో ఇరికించరాదని, వన్‌టౌన్ ఇంజినీరింగ్ అధికారులు చేసిన దానికి తాను అందరికీ జవాబు చెప్పాల్సి వస్తోందని ఆయన వాపోయినట్లు సమాచారం. పొరపాటున తీసుకొచ్చినా దానిని తిరస్కరిస్తారని సెక్రటరీ స్పష్టంచేసినా... సమావేశంలో మాత్రం ఆమోదం పొందడం గమనార్హం. అంతేగాక పశ్చిమ ఎంఎల్‌ఎ పిఎ చెప్తేనే అజెండాలోకి ఇంజినీరింగ్ అధికారులు తీసుకొచ్చినట్లు ఆ అధికారి చెప్పినట్లు విశ్వసనీయ సమాచారం. ఇదే అంశంపై సెక్రటరీ సెల్ అధికారిపై నగర పాలక సంస్థ కమిషనర్ కూడా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. అలాగే ఇదే డివిజన్‌లోని ఏకలవ్య నగరంలో సిమెంట్ రోడ్డు, ఆర్‌సిసి కల్వర్ట్‌లు నిర్మించడానికి రూ. 30.36 లక్షల అంచనా విలువతో జనరల్ ఫండ్ నుంచి జమ చేసే విధంగా స్థానిక (మిగతా 2లో)

కోడ్ సమయంలో సమావేశం చట్ట విరుద్ధం : సిపిఎం ఫ్లోర్‌లీడర్ బోయి సత్యబాబు

కోడ్ అమలులో ఉన్నందున స్థాయీ సంఘ సమావేశం నిర్వహించడం మున్సిపల్ చట్టం 1955 నిబంధనలకు విరుద్ధంమని, వెంటనే సమావేశాన్ని వాయిదా వేయాలని విజయవాడ నగర పాలక సంస్థలో సిపిఎం ఫ్లోర్‌లీడర్ బోయి సత్యబాబు డిమాండ్ చేశారు. ఈమేరకు నగరపాలక సంస్థ ఇన్చార్జి సెక్రటరీ (అడిషనల్ కమిషనర్-జనరల్) ఏ మహేష్‌కు ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సత్యబాబు మాట్లాడుతూ విజయవాడ నగరపాలక సంస్థ స్థాయి సంఘ సభ్యుల కాల పరిమితి ముగిసిందని, (మిగతా 2లో)

ఇన్చార్జి సెక్రటరీకి వినతిపత్రం అందజేస్తున్న సత్యబాబు

కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమం

- యూనియన్ నేత కాశీనాథ్ హెచ్చరిక
- సమస్యలపై విఎంసి కమిషనర్‌కు వినతిపత్రం అందజేత

విఎంసి కమిషనర్ దినకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాశీనాథ్ తదితరులు

ప్రజాశక్తి - విజయవాడ : పారిశుధ్య కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని మునిసిపల్ కార్పొరేషన్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) నగర గౌరవాధ్యక్షులు దోనేపూడి కాశీనాథ్ కోరారు. ఈ మేరకు మునిసిపల్ కార్మికులు, యూనియన్ నాయకులతో కలిసి కమిషనర్ చాంబర్‌లో నగర పాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాశీనాథ్ మాట్లాడుతూ పెరిగిన పని భారం, తగ్గిన వేతనాలతో కార్మికుల కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నా యన్నారు. ఎన్నికల సమయంలో రాత్రింబవళ్లు పని చేసిన మునిసిపల్ కార్మికులకు నేటికీ రెమ్యునరేషన్ ఇవ్వలేదన్నారు. మునిసిపల్ కార్మికుల పోరాటాల ఫలితంగా ఆదివారం పూర్తిగా సెలవు ఇస్తామని ఇచ్చిన హామీని ఏళ్లు గడుస్తున్నా అమలు చేయడం లేదన్నారు. ఆదివారం సెలవు ఇవ్వకపోతే మళ్లీ ఉద్యమం నిర్వహిస్తామని హెచ్చరించారు. పెండింగ్‌లో ఉన్న నెల హెల్త్ అలవెన్స్ బకాయిలు చెల్లించాలన్నారు. మరణించిన కార్మికుల కుటుంబాల సభ్యులకు వెంటనే ఉద్యోగం ఇవ్వాలని కోరారు. డివిజన్లలో కార్మికుల మస్టర్ సమయాన్ని ఉదయం 5.30 నుంచి 5.45 గంటలకు గ్రేస్ పిరియడ్ సమయాన్ని పొడిగించాలని కోరారు. పార్కుల్లో పనిచేస్తున్న 300 మంది కార్మికులను క్లీన్ ఎన్విరాన్‌మెంట్ వర్కర్స్ కేటగిరి-2లోకి మార్చి ప్రతి కార్మికుడికి రూ.21 వేల వేతనం చెల్లించాలన్నారు. నగరపాలక సంస్థకు చెందిన 700 మంది వెహికల్ డిపో కార్మికుల ప్రమోషన్లు, వేతనాల అంశాలను పరిష్కరించాలని కోరారు. పిహెచ్ వర్కర్‌గా ఉండి, డ్రైవర్‌గా పనిచేస్తున్న వారిని ప్రమోట్ చేయాలన్నారు. ఎక్సెల్ ప్లాంట్ కార్మికులకు కనీస వసతులు కల్పించాలని కోరారు. డ్రైవర్లు, క్లీనర్లు, మెకానిక్‌లకు యూనిఫారమ్, బూట్లు, రైన్ కోట్లు, కొబ్బరినూనె, సబ్బులు, టవల్స్ ఏళ్ల తరబడి పంపిణీ చేయడం లేదని విమర్శించారు. హెవీలైసెన్స్ ఉన్న క్లీనర్లను డ్రైవర్లు ప్రమోట్ చేయాలని, సంక్రాంతి (మిగతా 2లో)

రామోజీరావు సంస్మరణ సభకు ఏర్పాట్లు పూర్తి : కలెక్టర్ బాలాజీ

ప్రజాశక్తి - కలెక్టరేట్ (కృష్ణా) : ఈనాడు గ్రూపు సంస్థల అధినేత రామోజీరావు సంస్మరణ సభ ఏర్పాట్లు పూర్తయ్యాయని కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ చెప్పారు. పెనమలూరు మండలం తాడిగడప-ఎనికేపాడు 100 అడుగుల రోడ్డు అనుమోలు గార్డెన్స్‌లో గురువారం సాయంత్రం 4.30 గంటలకు సభ జరుగుతుందని తెలిపారు. శ్రీచైతన్య మహిళా జూనియర్ కళాశాల మీటింగ్ హాల్లో బుధవారం ఏఎస్ఎల్ (అడ్వాన్స్ సెక్యూరిటీ లైజనింగ్)లో సమావేశం నిర్వహించి సభ ఏర్పాట్లపై ఆయన సమీక్షించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సభలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొంటారని, సాయంత్రం 6.30 గంటల వరకూ సభ జరుగుతుందని తెలిపారు. అనంతరం నోవాటెల్‌కు వెళతారని తెలిపారు. ముందుగా ఏపీ సిఆర్డిఏ కమిషనర్ కాటంనేని భాస్కర్, పెనమలూరు ఎంఎల్ఏ బోడే ప్రసాద్, కలెక్టర్ డీకే బాలాజీ, జెసి గీతాంజలి శర్మ, విఎంసి కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్‌పి అద్నాన్ నయీమ్ అస్మి, సిఆర్డిఏ అదనపు కమిషనర్ అలీం బాషా, సభా ప్రాంగణం వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. .

నేడు అంబేద్కర్ గురుకులాల్లో సీట్ల భర్తీకి ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకులాల్లో 6, 7, 8, 9 తరగతుల్లో ఖాళీ సీట్ల భర్తీకి ఈనెల 27వ తేదీ ఉదయం 10 గంటలకు ప్రవేశ పరీక్ష జరుగుతుందని కృష్ణా, ఎన్‌టిఆర్ జిల్లాల సమన్వయ అధికారి బి.సుమిత్రదేవి ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 26వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు ఆయా పాఠశాలల్లో దరఖాస్తు చేసిన విద్యార్థులకు అవే పాఠశాలల్లో ప్రవేశ పరీక్ష జరుగుతుందని తెలిపారు. మెరిట్ రిజర్వేషన్ ఆధారంగా ఖాళీ సీట్లను భర్తీ చేస్తామని, ఖాళీలున్న పాఠశాలల్లో మాత్రమే పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు.

వైసిపి కార్పొరేటర్లలో వీడని నైరాశ్యం

మేయర్‌పై పరోక్షంగా మాటల దాడి
కష్టకాలంలో ఐక్యంగా ఉంటేనే ఫలితమని వ్యాఖ్య !

ప్రజాశక్తి - విజయవాడ : నగరపాలక సంస్థ వైసిపి ఫ్లోర్‌లీడర్ వెంకట సత్యనారాయణ ఛాంబర్‌లో బుధవారం ఆపార్టీ కార్పొరేటర్లు సమావేశం అయ్యారు. మేయర్ రాయన భాగ్యలక్ష్మి, డిప్యూటీ మేయర్లు బెల్లందుర్గ, అవుతు శ్రీశైలజ, ఆపార్టీ ఫ్లోర్‌లీడర్‌తోపాటు సుమారు 40 మంది వరకు కార్పొరేటర్లు హాజరయ్యారు. ప్రతి కౌన్సిల్ సమావేశానికి ముందు అజెండా అంశాలపై ఒక నిర్ణయానికి వచ్చేందుకు, దానిలోని అంశాలపై ఒక అవగాహనకు వైసిపి ఫ్లోర్‌లీడర్ చాంబర్‌లో ఆపార్టీ కార్పొరేటర్లు సాధారణంగా సమావేశం నిర్వహిస్తుంటారు. కానీ ఇటీవల జరిగిన సాధారణ ఎన్నికల్లో రాష్ట్రంలో వైసిపి ఘోర ఓటమిని చవిచూడటం, ఆపార్టీ క్యాడర్, స్థానిక కార్పొరేటర్లలో నిస్తేజం, నిస్సహాయత నెలకొన్న పరిస్థితుల్లో జరిగిన ఈ సమావేశం ఓ ప్రత్యేకతను సంతరించుకుంది. ఎన్నికల్లో ఓటమి అనంతరం విఎంసి కౌన్సిల్‌లో అధికార పక్షంగా ఉన్న మన కింకర్తవ్యం ఏమిటనే దిశగా చర్చ నడిచినట్లు సమాచారం. రాష్ట్ర ప్రభుత్వంతో ఎలా వ్యవహరించాలి, నిధులు, అధికారాల అంశాల్లో ఎలా ముందుకు సాగాలి అనే అంశాలను పలువురు కార్పొరేటర్లు ప్రస్థావించినట్లు సమాచారం. అలాగే విఎంసి స్టాండింగ్ కమిటీలోకి నూతన సభ్యుల ఎంపిక అంశం కూడా ప్రస్థావనకు వచ్చినట్లు తెలిసింది. అయితే ఇదే అదనుగా పలువురు కార్పొరేటర్లు ఎవరైతే తమకు లక్ష్యంగా ఉన్నారో వారిపై మేయర్‌పై రెచ్చిపోయినట్లు విశ్వసనీయ సమాచారం. ప్రోటోకాల్ అంశాల దగ్గర నుంచి డివిజన్లలో ప్రజాసమస్యలకు సంబంధించిన అంశాలను అజెండాలోకి తీసుకు రావడం, వాటిపై కౌన్సిల్‌లో చర్చించేంత వరకు తమను డమ్మీ చేశారని, ఇక నుంచి అలా వ్యవహరిస్తే కుదిరే పనికాదని వ్యాఖ్యానించినట్లు తెలిసింది. అందరూ సంఘటితంగా కలిసికట్టుగా పోతేనే తప్ప ఎవరి స్వలాభాలు వారు చూసుకుంటే కుదరదని ఘాటుగా విమర్శ పెట్టినట్లు విశ్వసనీయ సమాచారం. నిధులు, అధికారాలు పుష్కలంగా అందుబాటులో ఉన్నప్పుడు పని చేసే కన్నా పార్టీ కష్టకాలంలో ఉన్న సమయంలో చిత్తశుద్ధితో పని చేయాల్సి ఉంటుందని కౌన్సిల్‌లోని పెద్దలకు పలువురు కార్పొరేటర్లు తలంటినట్లు తెలిసింది.

రక్షిత మంచినీటిని సరఫరా చేయాలి

విఎంసి కమిషనర్‌కు టిడిపి కార్పొరేటర్ల వినతి

ప్రజాశక్తి-విజయవాడ : నగరంలో ప్రజలు కలుషిత నీరు తాగి అతిసార బారిన పడకుండా అధికారులు రక్షిత మంచినీటిని సరఫరా చేయడానికి చర్యలు తీసుకోవాలని టిడిపి ఫ్లోర్‌లీడర్ నెలిబండ్ల బాలస్వామి కోరారు. ఈమేరకు టిడిపి కార్పొరేటర్లతో ఆయన నగర పాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాలస్వామి మాట్లాడుతూ...విజయవాడ నగరంలో నీరు కలుషితం అవుతుందని, ప్రజలుపలు రకాల వ్యాధుల బారిన పడుతున్నారని అన్నారు. కలుషిత నీటి సమస్యపై పలుసార్లు అధికారులకు తమ పార్టీ తరుపున వినతిపత్రాలు అందజేసినా పట్టించుకోవడం లేదన్నారు. వినతిపత్రం అందజేసిన కార్పొరేటర్లలో ముమ్మనేటి ప్రసాద్, పొట్లూరి శివసాయి ప్రసాద్, వల్లభనేని రాజేశ్వరి, చెన్నుపాటి కాంతిశ్రీ, చెన్నగిరి రామమోహన్‌రావు, కంచి దుర్గా, మాజీ కార్పొరేటర్ చెన్నుపాటి గాంధీ ఉన్నారు.

సమన్వయం, సమష్టి కృషితో మాదక ద్రవ్యాలకు అడ్డుకట్ట : కలెక్టర్ డాక్టర్ గుమ్మళ్ల సృజన

ప్రజాశక్తి-విజయవాడ : సమన్వయం, సమష్టి కషితో మాదక ద్రవ్యాలకు అడ్డుకట్ట వేసేందుకు వివిధ శాఖల అధికారులు.. స్వచ్ఛంద సంస్థల సహకారంతో కషిచేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ గుమ్మళ్ల సజన సూచించారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో ఫోరం ఫర్ చైల్డ్ రైట్స్, సంయుక్త ఫౌండేషన్ భాగస్వామ్యంతో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ సృజన, జెసి పి.సంపత్ కుమార్, విఎంసి కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో డీఆర్‌వో వి.శ్రీనివాసరావు, విజయవాడ ఆర్‌డీవో బీహెచ్ భవానీ శంకర్, నందిగామ ఆర్‌డీవో ఎ.రవీంద్రరావు, జిల్లా యువజన సర్వీసుల అధికారి యు.శ్రీనివాసరావు, ఐసీడీఎస్ పీడీ జి.ఉమాదేవి, ఫోరం ఫర్ చైల్డ్ రైట్స్ జిల్లా కోఆర్డినేటర్ అరవ రమేష్ పాల్గొన్నారు.

ప్రకటన

తమిళనాడు రాష్ట్రం, కాంచీపురం మండలం, మనపక్కం, కృష్ణానగర్, మెయిన్ రోడ్డు, ప్లాటు నెం. 15/2 వాస్తవ్యులైన బి.శంకర్ అను నేను యజమానురాలు అయినటువంటి యాది విజయలక్ష్మి అలియాస్ (రంభ), తండ్రి. యాది వెంకటేశ్వరరావు గారి తాలూకు విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ఏరియాలో చేరిన విజయవాడ విలేజ్ పోర్షన్ ఆర్.ఎస్.నెం. 47/1రు దాఖలా సమీప డోర్ నెం. 43-106/1- 25 రు తాలూకు సంబంధించిన చ.గ. 600లకు సంబంధించిన దస్తావేజు నెం. 11893/2006గా గల విజయవాడ జిల్లా రిజిస్ట్రారు వారి ఆఫీసులో రిజిష్టరు కాబడిన ఒరిజినల్ దస్తావేజును నేను సదరు స్థలంను సర్వేయర్ ద్వారా కొలతలు వేయించి హద్దులు నిర్ణయించు కొనుటకు యజమానురాలు అయినటువంటి విజయలక్ష్మి అలియాస్ (రంభ) గారు సదరు ఒరిజినల్ దస్తావేజును నాకు అందజేసి ఉన్నారు. 15-06-2024న నేను గన్నవరంలో నా స్నేహితుడైన మేచినేని వెంకట శివ సత్యనారాయణ ను కలిసేందుకు వచ్చి ఉన్నాను. ఇక్కడ పనులు ముగించుకొని తిరిగి బైకు మీద గన్నవరం నుండి విజయవాడ వెళుతుండగా మార్గమధ్యంలో సదరు దస్తావేజులు కలిగిన బ్యాగు మరియు ఇతర బ్యాంకు కాగితాలు మరియు సదరు దస్తావేజులకు సంబంధించిన లింకు దస్తావేజులు నకలు కాపీలు మరియు ఆధార్ నకలు కాపీలు కలిగిన బ్యాగు 15/6/24న మధ్యాహ్నం 12 గంటల సమయంలో గన్నవరం సమీపంలోని కేసరపల్లిలో పోగొట్టుకోవటం జరిగింది. కావున సదరు బ్యాగ్ పోయినది. పోయిన నా బ్యాగ్ను వెతికించి సదరు బ్యాగులో ఉన్నటువంటి యావత్తు వస్తువులు మరియు దస్తావేజులు ఎవరికైనా దొరికితే ఇవ్వగలరు.

ఇట్లు
శంకర్.బి.
సెల్ నెం : 8978953333

IN THE COURT OF THE II ADDL. DISTRICT JUDGE AT VIJAYAWADA
E.A. 165/2022 IN E.P. 39/2015
OS NO. 190/2013

Between :
Yenugula Appa Rao .... Petitioner / DHr
And
I. Janaki Lakshmi and 2 others
.... Respondants/ JDRs

Substitute Summons :

Respondant/ JDR No.1 : iillipilla Janaki Lakshmi, W/o (late) Mohan Rao, D.No. 32-17-27/A, Ganganamma Street, Moghalrajpuram, Vijayawada-2.

Respondent No.2/ JDR No.2 : Mudili Hymavathi W/o (late) Chandra Sekhar, D.No. 2830, Payakapuram, NSC Bose Nagar (Kandrika), Vijayawada -15.

Respondant No.3 / JDR No.3 : Pothina Roja Ramani, W/o Sreedhar, D.No. 3-1-60/3, Ramalayam Street, Rama Rajya Nagar, Kabela Center, Vijayawada-12.

పై నెంబరు పిటీషన్‌లో ఒకటి, రెండు, మూడవ రెస్పాండెంట్స్ అయిన మీకు పై పిటీషను నోటీసులు పంపగా తీసుకొనక కాలయాపన చేయుచున్నందున ఈ పేపరు ప్రకటన ద్వారా సదరు పిటీషను సంగతులు తెలియేయవలసినదిగా పై కోర్టువారు ఆదేశించి యున్నారు. కావున ది. 9-7-2024వ తేదీన ఉదయం 10-30 గం.లకు పై కోర్టువారి ఎదుట స్వయంగా గానీ, లేదా మీ న్యాయవాది ద్వారా గానీ హాజరై మీ యొక్క అభ్యంతరములు తెలుపుకొన వలెను. లేనిచో మీ పరోక్షమున విచారించి తీర్మానించెదరని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదా : 09-07-2024
విజయవాడ.
ది.24-6-2024

ఇట్లు
జె.ఆర్.కె.శర్మ,
అడ్వకేట్, విజయవాడ.

మొదటిపేజీ తరువాయి

వీడని అతిసార

నిరంతరం సేవలందిస్తున్నారని తెలిపారు. జగ్గయ్యపేట మండలం బూచవరం పిహెచ్‌సి పరిధిలో ఇప్పటివరకు 28 అతిసార కేసులు నమోదుకాగా, ఏడుగురిని విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారని, మరో ఏడుగురు పిహెచ్‌సిలో చికిత్స పొందుతుండగా, 14 మంది కోలుకుని డిశ్చార్జి అయ్యారని తెలిపారు. జిల్లా హెచ్ఐవి లెప్రసీ అధికారి డాక్టర్ ఉషారాణి, డిప్యూటీ డిఎంహెచ్వో డాక్టర్ ఇందుమతి, డిస్ట్రిక్ట్ మలేరియా అధికారి డాక్టర్ మోతీ బాబు, డిపిఎంఓ మరియు డీఎస్ఓ డాక్టర్ పి నవీన్, ఆప్తమాలజిస్ట్ డాక్టర్ స్నేహ సమీరా, ఆప్తమాలజీ టీం రామకష్ణ, రాజశేఖర్, బాలాజీ నాయక్, సునీల్, డాక్టర్ అనిల్ కుమార్, విద్యాసాగర్, డాక్టర్ సమీరా, డాక్టర్ వాసంతి, డాక్టర్ నాగరాణి, డాక్టర్ స్రవంతి తదితర సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, ఎంపిహెచ్ (పి)లు, సూపర్వైజర్లు నిరంతరం వైద్య సేవలందిస్తున్నారు. బూచవరం పిహెచ్‌సి పరిధిలో 120 మంది సిబ్బంది, 8 మంది వైద్యులు, 20 మంది పిహెచ్‌సి సిబ్బంది, ఇద్దరు ఎంఎల్ హెచ్ (పి), 21 మంది ఏఎన్ఎంలు, 63 మంది ఆశ వర్కర్లు సేవలందిస్తున్నారు.

ప్రత్యేక వైద్య శిబిరాన్ని పరిశీలించిన సిపిఎం బృందం

జగ్గయ్యపేట మండలం షేర్ మహమ్మద్ పేట గ్రామంలో ఏర్పాటుచేసిన ప్రత్యేక వైద్య శిబిరాన్ని బుధవారం సిపిఎం నేతలు పరిశీలించారు. అలాగే బూచవరం పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ అనిల్ కుమార్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ, మండల కార్యదర్శి సోమోజు నాగమణి మాట్లాడుతూ అతిసారను యుద్ధ పాతిపదికన అరికట్టి ప్రజల ప్రాణాలను కాపాడాలని డిమాండ్ చేశారు. అతిసారకు గల కారణాలను గుర్తించాలని, అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని కోరారు. నిత్యం మంచినీటి ట్యాంక్‌లను శుభ్రపరచాలని, పారిశుధ్యాన్ని, డ్రైనేజీ వ్యవస్థలను మెరుగుపర్చాలని కోరారు. ప్రత్యేక వైద్య శిబిరాన్ని పాఠశాలలో కాకుండా మరోచోటుకు మార్చాలని, లేదా విద్యార్థులకు సెలవులైనా ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ అనిల్ కుమార్ స్పందిస్తూ ఉన్నతాధికారులతో మాట్లాడి వైద్య శిబిరాన్ని గ్రామంలోని ఆర్ అండ్ బి బంగ్లా సమీపంలోని వెల్నెస్ సెంటర్‌కు మారుస్తామని తెలిపారు. వైద్య శిబిరాన్ని సందర్శించిన వారిలో సిపిఎం నాయకులు కాకానబోయిన లింగారావు, కోటా కష్ణ, కోటా రవికుమార్, షేక్ గౌస్‌మియా, షేక్ బడే మియా, కె శ్రీనివాసరావు ఉన్నారు.

చర్చ నిల్

కార్పొరేటర్ తీసుకొచ్చిన అంశాన్ని స్థాయి సంఘం ఏకగ్రీవంగా ఆమోదించింది. విఎంసి పరిధిలోని జిమ్‌లు, స్టేడియం, స్విమ్మింగ్ పూల్స్‌లో పని చేయడానికి 10 మంది జిమ్ కోచ్‌లను ఈ ఏడాది ఏప్రిల్ నుంచి వచ్చే ఏడాది మార్చి వరకు కాంట్రాక్ట్ పద్ధతిలో తీసుకోవడానికి సమావేశం ఆమోదించింది. సర్కిల్-3 పరిధిలోని సచివాలయాల ప్రయివేటు భవనాల అద్దెను ప్రస్తుతం ఉన్న దానిపై ఐదు శాతం చొప్పున రివైజ్ చేసి చెల్లింపు అంశాన్ని ఆమోదించారు.

కోడ్ సమయంలో సమావేశం చట్ట విరుద్ధం

తిరిగి నూతన సభ్యుల ఎన్నికకు ఈనెల 21న ఎన్నికల నోటిఫికేషన్‌ను సెక్రటరీ సెల్ ద్వారా విడుదలైందని పేర్కొన్నారు. ఈనేపథ్యంలో తొమ్మిది అంశాలతో కూడిన స్థాయి సంఘ సమావేశపు నోటీసును ఈనెల 24 జారీ చేసి, ఈనెల 26న సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎజెండా నోటీసును సెక్రటరీ సెల్ ద్వారా జారీ చేశారని తెలిపారు. విజయవాడ పశ్చిమ ఎంఎల్ఏ సుజనా చౌదరి కాగా, స్థాయీ సంఘం అజెండాలోని మూడు నాలుగు అంశాలకు సంబంధించి ప్రస్తుత ఎంఎల్ఏ వెలంపల్లి శ్రీనివాస్ ఆదేశాల మేరకు అంటూ ఆయన పేరుతో రూ.29.94 లక్షల అంచనా విలువైన రోడ్డు నిర్మాణ పనులు, అలాగే మరో అంశానికి సంబంధించి అజెండాలో పొందుపరచడం మున్సిపల్ చట్టం నిబంధనలకు విరుద్ధమని పేర్కొన్నారు. ఇటువంటి తప్పిదాలు మున్సిపల్ సెక్రటరీ విభాగం నుండి జరగడం శోచనీయమని పేర్కొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమం

సందర్భంగా కార్మికులకు ఇస్తామన్న రూ.వెయ్యి ఇవ్వాలని, డ్రైవర్లకు చెత్త వెయిటేజీతో సంబంధం లేకుండా అన్‌లోడ్ చేయాలని కోరారు. ఎలక్ట్రికల్ విభాగంలోని ఆప్కాస్ కార్మికుల వేతనాలు పెంచాలని కోరారు. వీటిపై కమిషనర్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. కమిషనర్‌ను కలిసిన వారిలో యూనియన్ నగర అధ్యక్షులు ఎస్.జ్యోతిబాస్, నగర కోశాధికారి డి.స్టీఫెన్‌బాబు, ఆర్గనైజింగ్ కార్యదర్శి టి.ప్రవీణ్, నాయకులు జి.నాగరాజు, ఎం.హరిబాబు, వీరబాబు, టి.చిన్నా, వెంకట్రావ్ పాల్గొన్నారు.

బహిరంగ వేలం ప్రకటన

ఆర్.సి. నెం. 5/2024/ఏ **తేది: 26.06.2024**

ఎన్.టి.ఆర్. జిల్లా **చందర్లపాడు** మండలము పరిధిలోని కొడవటికల్లు గ్రామపంచాయతి **కొడవటికల్లు-అంబటిపుడి** రేవు నందు 2024-2025 (ది.01.07.2024 నుండి ది.30.06.2025 వరకు) (అనగా 12 నెలలకు) కాలమునకు కృష్ణా నది పై పడవ నడుపుకొనుటకు గాను **ది. 29-06-2024** వ తేది శనివారము బహిరంగ వేలం ఉదయం 11.00 గంటలకు కొడవటికల్లు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించబడును, వేలం పల్గొనుటకు గాను ముందుగా ధరావత్తు **రూ.25000/-** చెల్లించి వేలం లో పాల్గొనవలెను, కనిష్ట ధర విలువ **రూ.10,00,000/-** లు, పాట పూర్తి అయిన వెంటనే హెచ్చు పాటదారుడు ఖాయ పరచిన మొత్తము ధరను చెల్లించవలెను, ఇతర వివరములు/షరతులకు కొడవటికల్లు గ్రామపంచాయతి కార్యాలయపు పని వేళల యందు సంప్రదించి తెలుసుకొనగలరు. బహిరంగ వేలం తేది.29.06.2024 ఉదయం 11.00 నుండి నిర్వహించబడును. ఉదయం 10:00 నుండి డిపాజిట్ కట్టించుకోబడును. సదరు వేలం ఏదైనా కారణముల చేత ఆ రోజు పూర్తి కాని యెడల మరుసటి రోజున లేక నిర్ణయించబడిన తదుపరి తేదీలలో గాని వేలము జరుపబడును. అటువంటి సందర్భములో తదుపరి వేలము కొడవటికల్లు గ్రామపంచాయతి నోటిసు బోర్డు నందు మరియు టాంటాం ద్వారా సమాచారము తెలియపరచబడును. ఎట్టి కారణములు తెలుపకనే వేలము జరుపుటకు నిరాకరించుటకు లేదా తిరిగి వేలము నిర్వహించుటకు వేలము అధికారి గారికి పూర్తి అధికారము కలదు.

పంచాయతీ కార్యదర్శి,
కొడవటికల్లు గ్రామపంచాయతి,
చందర్లపాడు మండలం.

రోడ్లు గోతులమయం... ప్రమాదాల బారిన జనం

ప్రజాశక్తి-గన్నవరం: మండలంలో ప్రధాన రోడ్ల పరిస్థితి అధ్వానంగా తయారైంది. గన్నవరం-బీబీ గూడెం రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. రహదారిపై వేసిన తారు కొట్టుకుపోయి, కంకరరాళ్లు పైకిదేలి, అడుగడుగునా గుంతలు దర్శనమిస్తున్నాయి. ముఖ్యంగా గ్రామంలోని చర్చి దగ్గర పెద్ద గోతులు పడింది. తోటపల్లి వరకు సుమారు 8 కిలోమీటర్ల మేర రోడ్డు రూపు రేఖలు కోల్పోవడంతో ఆ మార్గంలో ప్రయాణ మంటేనే ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగించే ఈ రహదారి గత ఐదేళ్లలో కనీస మరమ్మతులకు నోచుకోలేదు. రోడ్డు మలుపుల వద్ద ఏర్పడ్డ గుం తలవల్ల వాహనాలు అదుపుతప్పి రాత్రివేళల్లో ప్రయాణాలు సాగించే వాహనదారులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. గన్నవరం-ముస్తాబాద రోడ్డు పురుషోత్తపట్నం, వి ఎన్ పురం గ్రామాల మధ్య సుమా రు 5 కిలోమీటర్ల మేర రోడ్డు కుంగిపోయి ఎత్తు, పల్లాలతో, గోతులమయంగా మారింది. దీంతో ఈ రోడ్డుమీద ప్రయాణమంటేనే వాహన దారుల గుండెల్లో దడ పుడుతోంది. ఈ రోడ్డులో వెళ్తున్న వ్యాన్లు, కార్లు, బస్సులు, ఆటోలు నియంత్రణ తప్పి పంట బోదెలు, కాలువలోకి దూసుకెళ్లడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా రాత్రివేళల్లో రాకపోకలు సాగించే ద్విచక్రవాహనదారులు ప్రమాదాలబారిన పడి ఆస్పత్రుల పాలవుతున్నారు. ఈ రహదారిపై తరచూ ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకునే నాథుడే లేడని ప్రజలు, వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రహదారికి మరమ్మతులు చేపట్టడంలో వైసీపీ పాలకుల నిర్లక్ష్య వైఖరిపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి ప్రస్తుత టీడీపీ ప్రభుత్వమైనా రోడ్ల అభివృద్ధి. మరమ్మతులపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

బాధితులకు సాయం

ప్రజాశక్తి-చల్లపల్లి

స్థానిక నారాయణరావు నగర్ ఇటీవల అగ్ని ప్రమాదానికి సర్వం కోల్పోయిన గరికపాటి యశోద కుటుంబానికి చల్లపల్లి జనసైనికులు పసుపులేటి శ్రీను ఫ్రెండ్ సర్కిల్, కరెంటు రమణ, సోమిశెట్టి రాఘవ అగ్ని ప్రమాద బాధితురాలు గరికపాటి యశోధకు బుధవారం నిత్యావసర సరుకులు, బియ్యం, వంట సామాగ్రి, అందించారు. దాతల నుంచీ మరింతగా సహకారం అందేలా కృషి చేస్తానని తెలిపారు.

భూ అధీకృత చట్టాన్ని అమలు చేయాలి

కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి రంగారావు

ప్రజాశక్తి-గుడివాడ : వైసిపి ప్రభుత్వం తెచ్చిన కౌలు రైతుల చట్టాన్ని రద్దు చేసి 2011 భూ అధీకృత చట్టాన్ని అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి పంచకర్ల రంగారావు అన్నారు. గుడివాడ సుందరయ్య భవనంలో కౌలు రైతుల సంఘం జిల్లా సమావేశం బుధవారం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా నాయకులు బివి శ్రీనివాసరావు ప్రారంభ ఉపన్యాసం ద్వారా వక్తలను వేదిక మీదికి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ గ్రామ సభల ద్వారా కౌలు రైతులను గుర్తించాలని, భూ యజమానుల సంతకంతో సంబంధం లేకుండా గ్రామ రెవిన్యూ అధికారులే కౌలు రైతులను గుర్తించి కౌలు కార్డులను ఇవ్వాలన్నారు. పంట నమోదు ఈ క్రాప్ బుకింగ్ కౌలు రైతుల పేరుతోనే నమోదు చేయాలన్నారు. పంట రుణాలు, పంటల భీమా, పంట నష్టపరిమారాలు, రైతు భరోసా వంటి ప్రభుత్వ పథకాలు కౌలు రైతులకే అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. కులాలతో సంబంధం లేకుండా భూమి లేని ఓసి కౌలు రైతులకు కూడా భరోసా ఇవ్వాలని రంగారావు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు టివి లక్ష్మణస్వామి, జిల్లా అధ్యక్షులు కె శివనాగేంద్ర, ఉపాధ్యక్షులు శీలం నారాయణ, కౌలు రైతులు మట్లపూడి నాగమల్లేశ్వరరావు, లేళ్ళ రాంబాబు, కె శ్రీదేవి, పొదిలి వెంకటేశ్వరరావు, మాదాసు మురళీకృష్ణ, రమాదేవి, గోవర్ధన్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి రంగారావు

చర్చి నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి-అవనిగడ్డ

మోపిదేవి మండల పరిధిలోని బోడగుంట గ్రామంలో నిర్మిస్తున్న చర్చి నిర్మాణానికి అవనిగడ్డకు చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త విక్కుర్తి శ్రీనివాస్ రూ.50 వేలు ఆర్థిక సాయం అందజేశారు. చర్చి పాలకవర్గ సభ్యులు నిర్మాణంలో ఎదురవుతున్న ఆర్థిక ఇబ్బందులు వివరించగా బుధవారం అవనిగడ్డ లోని శ్రీనివాస్ స్వగృహం వద్ద ఈ మొత్తాన్ని పాలకవర్గ అకౌంట్‌కు పంపించినట్లు తెలిపారు.

ముగిసిన అగ్నిమాపక శిక్షణ

ప్రజాశక్తి-గుడివాడ: అగ్నిమాపక సిబ్బంది ఆసుపత్రులలో ప్రమాదాలు జరగకుండా ఆసుపత్రి యాజమాన్యానికి, సిబ్బందికి అవగాహన కల్పించడం హర్షించదగ్గ విషయమని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షులు పాలడగు వెంకటరావు అన్నారు.

గుడివాడ ఐఎంఎ హాలు నందు ఎడిఎఫ్‌వో జె ఆంజనేయులు ఆధ్వర్యంలో అగ్నిమాపక మూడు రోజుల శిక్షణా తరగతులు బుధవారం నాటికి ముగిశాయి. ఈ సందర్భంగా పాలడగు వెంకట్రావు మాట్లాడుతూ ఆసుపత్రులలో ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై దృశ్యరూపంలో పిపిటి ద్వారా వివరించి తగు సూచనలు చేస్తూ ఆసుపత్రుల యందు అగ్నిమాపక పరికరాలు ఏవిధంగా ఉపయోగించాలో ప్రాక్టికల్‌గా సిబ్బందికి వివరించినందుకు అగ్నిమాపక సిబ్బందికి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఐఎంఎ జనరల్ సెక్రటరీ వైద్యులు పిన్నమనేని రామకృష్ణ, అగ్నిమాపక సిబ్బంది, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

ప్రజాశక్తి-పమిడిముక్కల: అంగన్వాడి పాఠశాలలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, గర్భిణులు, విద్యార్థులకు పోషకాహారం అందించాలని కృష్ణాపురం సెక్టర్ సూపర్వైజర్ ఎం ఝాన్సీరాణి అన్నారు. బుధవారం లంకపల్లి సచివాలయం పరిధిలోని లంకపల్లి, శ్రీరంగాపురం అంగన్‌వాడీ కేంద్రాల గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లంకపల్లి గ్రామ సర్పంచ్ వేమూరి రత్నకుమారి, గ్రామ కార్యదర్శి విజయ దుర్గ, ఎఎన్ఎం వసంత కుమారి పాల్గొన్నారు.

చదువుతోనే ఉన్నత భవిష్యత్తు : కొల్లు

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): చదువులో గొప్పగా రాణించి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని రాష్ట్ర గనులు భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర విద్యార్థులకు ఉద్బోధించారు. బుధవారం ఆయన స్థానిక చిలకలపూడి పాండురంగ నగరపాలక ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలతో పాటు విద్య సంబంధ కిట్లను ఉచితంగా అందించారు. 750 మంది విద్యార్థులున్న ఈ పాఠశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫారం, బెల్ట్, నోట్ బుక్స్, నిఘంటువు, బ్యాగులను పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్య రంగానికి అధిక మొత్తంలో నిధులను వెచ్చిస్తోందని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. తెలుగువారికి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపును తెచ్చిన తెలుగు వ్యక్తి మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్ల వంటి వారిని ఆదర్శంగా తీసుకొని ఉన్నత లక్ష్యాలను ఏర్పరుచుకుని వాటి లక్ష్య సాధనకు కృషి చేయాలన్నారు. నాణ్యమైన విద్యను అందించటం ద్వారానే మంచి సమాజ నిర్మాణం సాధ్యమని, ఈ దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తుందని అన్నారు. ఈ క్రమంలోనే రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారంలోకి రాగానే మెగా డీఎస్సీ పై తొలి సంతకం చేసి తన చిత్తశుద్ధిని నిరూపించుకున్నారన్నారు. ఈ క్రమంలో మంత్రి విద్యార్థులతో ముఖాముఖి ముచ్చటిస్తూ పాఠశాలకు ఉన్న అవసరాలను అడగ్గా, అదనపు తరగతి గదులు, బెంచీలు, ఫ్యాన్లు, మరుగుదొడ్ల మరమ్మతులు, ఆడుకోవటానికి ఆట స్థలం కావాలని విద్యార్థులు తెలిపారు. అందుకు ఆయన స్పందిస్తూ త్వరలో వీటన్నిటిని సమకూరుస్తానని హామీ ఇచ్చారు. మధ్యాహ్నం భోజనం నాణ్యతపై ఆరా తీసి అందుకు ఉపయోగిస్తున్న బియ్యం నాణ్యతను ఆయన స్వయంగా పరిశీలించారు. కూరలు ఎలా ఉంటున్నాయి, మెనూ ప్రకారం గుడ్లను అందిస్తున్నది లేనిది ప్రత్యక్షంగా విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు బండి రామకష్ణ, జిల్లా విద్య శాఖ అధికారిణి తాహెర సుల్తానా, మున్సిపల్ కమిషనర్ బాపిరాజు, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ మోటమర్రి బాబా ప్రసాద్, ఎంఈఓ దుర్గాప్రసాద్, ప్రధానోపాధ్యాయులు యువి కృష్ణమూర్తి పాల్గొన్నారు.

సప్లిమెంటరీ ఫలితాల్లో సత్తా చాటిన విద్యార్థులు

ప్రజాశక్తి-చల్లపల్లి: ఇంటర్ అడ్వాన్స్ సప్లమెంటరీ ఫలితాలలో చల్లపల్లి విజయ జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారని కళాశాల డైరెక్టర్ యార్లగడ్డ శివప్రసాద్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ప్రకటించిన ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలలో చల్లపల్లి విజయ జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యున్నతమైన ఫలితాలను సాధించారు. ఎంపీసీ ఫస్ట్ ఇయర్ ఫలితాలలో పడవల శ్రీ సత్యప్రియ 470 మార్కులకు 466 మార్కులు సాధించి టౌన్ ఫస్ట్ లో నిలిచారు. అలాగే భాస జోష్న, నారం శెట్టి రక్షిత,డొక్కు లక్ష్మీ ప్రియాంక, తుపాకుల లోకన్యశ్రీ, మునగాల తేజస్విని 465 మార్కులు సాధించారు. సీఈసీ ఇంగ్లీష్ మీడియం మొదటి సంవత్సరం పరీక్షా ఫలితాలలో వంగర పావని 500 మార్కులకు 481 మార్కులు సాధించి టౌన్ ఫస్ట్ లో నిలిచారు.ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినిలకు కళాశాల డైరెక్టర్ యార్లగడ్డ శివప్రసాద్, ప్రిన్సిపాల్ షేక్ అబ్దుల్ రహీం, శ్రీ వివేకానంద డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్రమేష్ అధ్యాపకులు అభినందనలు తెలియజేశారు.

లావణ్యశ్రీకి అత్యధిక మార్కులు

ప్రజాశక్తి-చల్లపల్లి: స్థానిక విజయక్రాంతి జూనియర్ కళాశాల విద్యార్థిని అవనిగడ్డ లావణ్యశ్రీ ఇంటర్మీడియట్ ఫస్ట్ ఇయర్ ఎంపీసీ గ్రూపులో బెటర్మెంట్ పరీక్ష ఫలితాల్లో 470 మార్కులకు 465 మార్కులు సాధించినట్లు విద్యాసంస్థ అధినేత దుట్టా శివరామ ప్రసాద్ బుధవారం తెలిపారు. అవనిగడ్డ లావణ్యశ్రీ పదవ తరగతి పురిటిగడ్డ ప్రభుత్వ పాఠశాలలో చదివి 600 మార్కులకు 527 మార్కులను సాధించింది. ఇంతటి ఘన విజయాన్ని సాధించిన అవినిగడ్డ లావణ్యశ్రీని కళాశాల అధ్యాపకులు అభినందించారు.

'మారుతి' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-కోడూరు: కోడూరులోని మారుతి జూనియర్ అండ్ డిగ్రీ కళాశాల 2023-24 ఇంటర్ ఫస్టియర్ బెటర్మెంట్ ఫలితాలలో విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు అని కళాశాల ప్రిన్సిపల్ జె.వి.ఎస్.ఎస్ మూర్తి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం బెటర్మెంట్ ఫలితాలలో ఎంపీసీ గ్రూపు లో 470 మార్కులకు 460 మార్పుల తో బెల్లంకొండ నాగలక్ష్మి మండలం ఫస్ట్ సాధించారని, అలాగే సీఈసీ గ్రూపులో 500 మార్కులకు 475 మార్కులతో కొండవీటి గణేష్ మండలం ఫస్ట్ సాధించారని తెలిపారు.

లిఖితకు అత్యధిక మార్కులు

ప్రజాశక్తి-అవనిగడ్డ: ఇంటర్మీడియట్ బోర్డ్ విడుదల చేసిన మొదటి సంవత్సరం ఇంటర్ సప్లమెంటరీ ఫలితాలలో అవనిగడ్డ ఎస్‌విఎల్ క్రాంతి జూనియర్ కళాశాలకు చెందిన ఎంపీసీ గ్రూప్ విద్యార్థిని అల్లంశెట్టి లిఖిత 470 మార్కులకు 466 మార్కులు సాధించి ప్రభంజనం సృష్టించినట్లు కళాశాల కరస్పాండెంట్ ఉమామహేశ్వరరావు తెలిపారు లిఖిత రాష్ట్రస్థాయిలో ఉత్తమ మార్కులు సాధించినందుకు కరస్పాండెంట్‌తో పాటు ప్రిన్సిపాల్ ఎన్‌వి నాగేశ్వరరావు అభినందించారు.

మండలికి అభినందనలు

ప్రజాశక్తి-అవనిగడ్డ: అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్‌ను దివిసీమ కెమిస్ట్ అండ్ డ్రగ్ గెస్ట్ అసోసియేషన్ సభ్యులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. కోడూరు నాగాయలంక అవనిగడ్డ మోపిదేవి మండలాలకు చెందిన అసోసియేషన్ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొని బుద్ధప్రసాద్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు ధన సురేష్, సుధాకర్, విజయ్‌కుమార్ సభ్యులు పాల్గొన్నారు.

అంగీకార పత్రాన్ని చూపుతున్న దృశ్యం

సిఐటియు పోరాటంతో బాధిత కుటుంబానికి న్యాయం

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం: రాజమండ్రి కోవూరు కు చెందిన గొల్లపూడి - సూరాయపాలెం ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టిన నవయుగ కంపెనీలో ఎలక్ట్రిషన్‌గా పనిచేస్తూ అనుమానాస్పదంగా మృతి చెందిన సాకా వీరేంద్ర కుటుంబానికి సిఐటియుగా రూ.22.50 లక్షలు బాధిత కుటుంబానికి అందేలా పోరాడారు. వర్క్ మెన్ కాంపెన్సేషన్ యాక్ట్ ప్రకారం ఇన్సూరెన్స్ రూపంలో 15 లక్షలు నవయుగ కంపెనీ ద్వారా నిధులు రూ.7.50లక్షలు ఇచ్చేందుకు అంగీకరించినట్లు సిఐటియు నాయకులు తెలిపారు. మట్టి ఖర్చుల నిమిత్తం రూ.50 వేలు తక్షణ సాయంగా అందించారు.

ఫీజుల దోపిడీ అరికట్టాలి

ఎస్‌ఎఫ్‌ఐ వినతి

ప్రజాశక్తి - నందిగామ : కార్పొరేట్ విద్యాసంస్థల అధిక ఫీజుల దోపిడీ అరికట్టాలని, అనుమతులు లేకుండా నడుస్తున్న విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు గోపి నాయక్ జిల్లా విద్యా శాఖ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు గోపి నాయక్ మాట్లాడుతూ ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా విద్యాసంవత్సరం ప్రారంభం నుండి తల్లిదండ్రులకు ఫీజులవాత విద్యార్థులకు పుస్తకాల మోత తప్పడం లేదన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ఫీజులకంటే ఏ మాత్రం ఎక్కువ వసూలు చేయకూడదని, అలా చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని రాష్ట్ర ప్రభుత్వం, పాఠశాల విద్యాశాఖ పదేపదే హెచ్చరిస్తున్నా కొన్ని సంస్థలకు నోటీసులు జారీ చేస్తున్నాయన్నారు. ఇవేమీ తమకు పట్టనట్టుగా కొన్ని యాజమాన్యాలు ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేస్తున్నాయని తెలిపారు. కొన్ని యాజమాన్యాలు అయితే గత ఏడాది కన్నా ఇప్పటికీ ఫీజులు రెట్టింపు చేశాయన్నారు. మరికొన్ని చోట్ల రెండు, మూడు రెట్లు కూడా పెంచుకున్నాయన్నారు. ఈ దోపిడీ ఎల్.కె.జి నుండే ఆరంభమవుతుందని తెలిపారు. ఎల్.కె.జికి లక్షలాది రూపాయలు వసూలు చేసే పాఠశాలలు పుట్టు కొచ్చాయన్నారు. నిర్దిష్టమైన ఆరోపణలతో ఏయే యాజమాన్యాలు ఎంతెంత ఫీజులు వసూలు చేస్తున్నారో సమగ్ర వివరాలతో ఫిర్యాదులు చేసినా చర్యలు తీసుకోలేదన్నారు. అధిక ఫీజుల దోపిడీపై విద్యాశాఖ అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఎస్ఐ) కోరుతుందన్నారు.

దుర్గమ్మను దర్శించుకున్న సినీ ప్రముఖులు

ప్రజాశక్తి- వన్‌టౌన్ : ఇంద్రకీలాద్రిపై ఉన్న కనకదుర్గమ్మ దర్శనార్థం సినీ నిర్మాత సి.కళ్యాణ్, సినీ నటుడు అశోక్, శ్రీధర్ బుధవారం ఆలయానికి విచ్చేశారు. ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. అనంతరం వేద ఆశీర్వచనం గావించారు.

19 నుండి శాకంబరీ దేవి ఉత్సవాలు

ఏర్పాట్లపై అన్ని విభాగాల అధికారులతో ఇఒ సమావేశం

ప్రజాశక్తి- వన్‌టౌన్ : శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానము, ఇంద్రకీలాద్రి దేవస్థానంలో రానున్న ఆషాఢ మాసం, జూలై 19 నుండి 21 వరకూ శాకాంబరీ దేవి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కె.ఎస్.రామారావు తెలిపారు. ఈ సందర్భంగా యాత్రికులు, భక్తుల సౌకర్యార్థం చేయవలసిన ఏర్పాట్లు గురించి మహామండపం నాల్గవ అంతస్తులో ఆలయ కార్యనిర్వాహణాధికారి కె.ఎస్.రామారావు ఆలయంలోని అన్ని విభాగాల అధికారులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆలయ కార్యనిర్వహణాధికారితో పాటు ఆలయ స్థానాచార్యులు విష్ణుభట్ల శివప్రసాద శర్మ, వైదిక సిబ్బంది, కార్యనిర్వాహక ఇంజినీర్లు కే.వి.ఎస్ కోటేశ్వరరావు, లింగం రమ, డి.ఇ.ఇ., ఏఇఇలు, ఏఇఓలు, పర్యవేక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఆషాఢ మాసం జూలై 6వ తేదీ నుండి ఆగస్టు 5వ తేదీ వరకూ ఆషాఢ మాసమని తెలిపారు. జూలై 19 నుంచి 21 వరకు దుర్గమ్మ దేవాలయంలో శాకంబరీ దేవి ఉత్సవాల గురించి, వివిధ విభాగాల వారు చేపట్టవలసిన విధుల గురించి చర్చించారు. సారె సమర్పించు సందర్భంగా యాత్రికులకు ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్ ఉమ్మడి దేవాలయాల కమిటీ వారు గత సంవత్సరం వలే ఈ ఏడాది కూడా జులై 14న బ్రాహ్మణ వీధి, జమ్మిదొడ్డి నుండి ఊరేగింపుగా బయలుదేరి ఆలయానికి చేరుకొని అమ్మవారికి బంగారు బోనం, పట్టు వస్త్రాలు సమర్పించి పూజలు నిర్వహించేందుకు ఏర్పాట్లు గురించి కూడా చర్చించారు.

ఆలయ అధికారులతో సమావేశంలో పాల్గొన్న ఇఓ రామారావు

నర్సింగ్ కళాశాలలో వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి- నందిగామ : జీడిఎంఎం నర్సింగ్ కళాశాలలో కళాశాల సెక్రటరీ గురువింద పల్లి సురేష్ ఆధ్వర్యంలో నేషనల్ డ్రగ్స్ డే సందర్భంగా నర్సింగ్ విద్యార్థినీ విద్యార్థులకు వ్యాసరచన పోటీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నందిగామ ఎక్సైజ్ సర్కిల్ ఇన్స్పెక్టర్ కోటేశ్వరరావు ఆధ్వర్యంలో మొదటి రెండవ మూడవ స్థానంలో నిలిచిన విద్యార్థిని విద్యార్థులకు ప్రశంసా పత్రం తో పాటు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా సిఐ కోటేశ్వరరావు మాట్లాడారు. అనంతరం విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. వ్యాసరచన పోటీల్లో మొదటి రెండో మూడో స్థానం విజేతలను కళాశాల సెక్రటరీ గురువింద పల్లి సురేష్ అభినందించారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ లూడియా అధ్యాపకులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

విజేతలకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న దృశ్యం

స్పీడ్ బ్రేకర్‌లు వేస్తున్న దృశ్యం

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు

ప్రజాశక్తి- నందిగామ :

నందిగామ పట్టణ సిఐ హనీష్ ఆదేశాలు మేరకు ఎన్టీఆర్ రోడ్, రైతు పేట జాతీయ రహదారిపై స్పీడ్ బ్రేకర్లను బుధవారం పోలీసులు దగ్గరుండి ఏర్పాటు చేశారు. స్పీడ్ బ్రేకర్లను సిఐ హనీష్ పరిశీలించారు. రైతు పేట జాతీయ రహదారిపై ఎన్టీఆర్ రోడ్లో ఈ ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాలు కార్లు అతివేగంగా వెళుతున్నాయి. కాలేజీ విద్యార్థులు స్కూలు విద్యార్థుల తో ఈ ప్రాంతాలు నిత్యం రద్దీగా ఉంటాయి. ముందు జాగ్రత్తగా సిఐ ఆదేశాల మేరకు ట్రాఫిక్ ఎస్ఐ ఎటువంటి ప్రమాదాలు జరగకుండా స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయించారు. ట్రాఫిక్ ఎస్సై విజయ్ సుందర్ పాల్గొన్నారు.

ఇంటర్ ఇంప్రూవ్‌మెంట్ పరీక్షా ఫలితాల్లో

నాగార్జున కళాశాల విజయకేతనం

ప్రజాశక్తి - తిరువూరు : ఇంటర్మీడియట్ ఇంప్రూవ్‌మెంట్ పరీక్షా ఫలితాల్లో తిరువూరు నాగార్జున జూనియర్ కళాశాల విద్యార్థులు విజయకేతనం ఎగరేసినట్లు ప్రిన్సిపాల్ కె.శేషగిరిరావు బుధవారం విలేకరులకు తెలిపారు. ఇంగ్లీష్ మీడియం జూనియర్ ఎంపిసిలో 470 మార్కులకు గానూ రామడుగు మేఘన, నారాయణపురపు దుర్గాంజలి 466, గర్నేపూడి భాగ్యలక్ష్మి 465, గంటల దీక్షిత, బత్తుల కావ్యశ్రీ, కొప్పుల అఖిలశ్రీ, కొట్టాగుండ్ల సాయి మునీష్, సముద్రాల డింపుల్ నిఖీస్ 464 మార్కులు, బైపిసి లో 440 మార్కులకు గానూ తరిగొప్పల నవ్య శ్రీ 424, సిఇసిలో 500 మార్కులకు గాను పోడెంపూడి శ్రావ్య 455 మార్కులు సాధించి అందరూ రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించినట్లు ఆయన పేర్కొన్నారు.

జక్కంపూడిలో గుర్తు తెలియని మహిళ మృతదేహం

ప్రజాశక్తి- వన్‌టౌన్ :

జక్కంపూడి గ్రామ పంచాయితీ పరిధిలోని 60:40 ప్లాట్ల ఏరియాలో ఓ గుర్తు తెలియని మహిళ మృతదేహం రోడ్డు పక్కన పడి వున్న సంఘటనపై టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు పెనమలూరు మండలం, కానూరు గ్రామం తోటకూర సుబ్బారావు వీధిలో నివాసం వుంటే మద్రెపూడి శివయ్య గత నాలుగు సంవత్సరాలుగా విజయవాడ రూరల్ మండలం జక్కంపూడి-2కి గ్రామ రెవెన్యూ అధికారి (విఆర్ఓ)గా విధులు నిర్వర్తిస్తున్నాడు. కాగా విధుల్లో ఉండగా బుధవారం మధ్యాహ్నం సమయంలో జక్కంపూడి గ్రామ పంచాయతీ పరిధిలోని 60 ; 40 ప్లాట్ల ఏరియాలో రోడ్డుకు ఎడమ వైపున సుమారు 40 నుంచి 45 ఏళ్ళ వయస్సు గల మహిళ మృతదేహం పడి వుందని విఆర్ఓ శివయ్యకు సమాచారం అందడంతో వెళ్ళి పరిశీలించగా, మహిళ చనిపోయి వుంది. ఆమె ఒంటిపై పింక్ కలర్‌పై బులుగు రంగు డిజైన్ ఉన్న చీర, ఎరుపు రంగు జాకెట్ ధరించి వుంది. మహిళ మెడకు తెలుపు రంగు టవల్ ధరించబడి ఉంది. కాగా మహిళ నుదురు మీద, ముఖంపై, కుడి కాలు మీద గాయాలయి వున్నాయి. అయితే ఆ మహిళను గుర్తు తెలియని వాహనం ఢీకొని గాని లేదా ఎవరైనా హత్యచేసి పడేసి ఉండవచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. చుట్టుపక్కల వారిని ఆరా తీసినా ఆచూకీ తెలియరాలేదు. దీంతో విఆర్ఓ టూటౌన్ పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు గుర్తు తెలియని మహిళ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదుచేసి విచారణ చేపట్టినట్లు సిఐ గణేష్ తెలిపారు.

28న మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి - అజిత్‌సింగ్‌నగర్ : 63వ డివిజన్లో రాజీవ్ నగర్ కండ్రిక రోడ్డులో మాస్టర్ మైండ్ స్కూలు ఆవరణలో 28న వన్‌టౌన్ అయాన్ ఐ హాస్పిటల్ డాక్టర్ల చే కంటి పరీళలు చేస్తారని నిర్వాహకులు తెలిపారు. అయన్ ఐ హాస్పిటల్ చీఫ్ డాక్టర్ బషీర్ అహ్మద్ నేతతంలో అనుభవగులైన డాక్టర్ల చే కంటిచూపు పరీక్షలు శుక్లాలు నల్లగుడ్డు మైగ్రేన్లతో పాటు డయాబెటిస్ తదితర పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. సింగ్ నగర్ కృష్ణ హోటల్ సెంటర్లో ఫ్యామిలీ హాస్పటల్ డాక్టర్లచే ఉచితంగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సైరాబాన్ ఆధ్వర్యంలో బీపీ షుగర్ థైరాయిడ్ కిడ్నీలో రాళ్ల రక్తహీనత చిన్నపిల్లలు మహిళల ఆరోగ్య సమస్యలన్నిటిపై 26 రకాల వైద్య పరీక్షలు కూడా ఉచితంగా నిర్వహిస్తారని తెలిపారు. ఈ రెండు మెగా వైద్య శిబిరాలను వావిరాల రజనీకాంత్ శర్మ పర్యవేక్షణ నిర్వహిస్తున్నారు.

జెండా ఆవిష్కరిస్తున్న మేరీ కుమారి

శ్రీనివాసరావు వర్ధంతి

ప్రజాశక్తి విస్సన్నపేట : రైతు సంఘం నాయకులు బండారుపల్లి శ్రీనివాసరావు 12 వర్ధంతి సందర్భంగా మండలం కలగర గ్రామపంచాయతీ శివారు లక్ష్మీపురంలో శ్రీనివాసరావు స్థూపం వద్ద జెండాను సిపిఎం సీనియర్ నాయకులు బుర్రి మేరీ కుమారి జండా ఆవిష్కరించి నివాళులర్పించారు. అనంతరం ఆయన చిత్రప టానికి సిపిఎం మండల కార్యదర్శి విస్సం పల్లి నాగరాజు పూలమాల వేసి నివాళుల ర్పించారు. బండారుపల్లి శ్రీనివాసరావు రైతు సంఘం నాయకుడిగా సిపిఎం మండల కమిటీ సభ్యుడిగా విసన్నపేట మండలంలో అనేక ప్రజా సమస్యలపై ఆయన పనిచేశారన్నారు. సిపిఎం మండల నాయకులు బొట్టు చెన్నకేశవరావు శ్రీనివాసరావు కుమార్తె కుమారులు సునీత రాజేష్ మరియు వెల్ది సూరిబాబు నివాళులర్పించారు.

మత్తుపదార్థాల రహిత దేశం కోసం ప్రతిజ్ఞ

ప్రజాశక్తి - విజయవాడ : మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక అంతర్జాతీయ దినోత్సవ సందర్భంగా ఎపిఎస్ఆర్‌టిసి పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్‌లో బుధవారం ప్రతిజ్ఞా కార్యక్రమం జరిగింది. అధికారులు, ఉద్యోగులు, కార్మికులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్ డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ బషీర్ అహ్మద్ మాట్లాడుతూ... మాదక ద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణాకు వ్యతిరేకంగా అందరూ కృషి చేసినప్పుడే మన భావి తరాలను కాపాడుకోగలమని పేర్కొన్నారు. మాదక ద్రవ్యాల వినియోగం వలన ఉన్నత స్థానాలకు ఎదగాల్సిన యువత, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్ నాశనం చేసుకుంటున్నారని అన్నారు. ఈ సందర్భంగా హాజరయిన వారందరి చేత బషీర్ అహ్మద్ మత్తు పదార్థ రహిత దేశం కోసం ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎన్టిఆర్ జిల్లా పర్సనల్ ఆఫీసర్ అలివేలు మంగ, స్టేషన్ సూపర్‌వైజర్లు, ఉద్యోగులు, కార్మికులు, 'నీ తోడు మానసిక వికాస కేంద్రం' సిబ్బంది పాల్గొన్నారు.

కనెక్షన్ ఒకటి... వినియోగం మూడు

- చోద్యం చూస్తున్న విద్యుత్ శాఖ అధికారులు
- దినదినగండంగా గడుపుతున్న రైతులు


మూడు చెరువులకు విద్యుత్ సరఫరా అయ్యే మీటర్

ప్రజాశక్తి-పెదన: అధికారుల నిర్లక్ష్యమో, పాలకుల అలసత్వమో తెలియదు కానీ ఆయా గ్రామాల ప్రజలు, రైతులు, కూలీలు దినదినగండంగా కాలాన్ని వెళ్లదీస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలను తుంగలోకి తొక్కి ప్రజ శ్రేయస్సుకు విరుద్ధంగా నిర్మించిన వాటిపై చర్యలు తీసుకోవాల్సిన సంబంధించిన శాఖ అధికారులు కన్నెత్తి చూడకపోవడం గమనార్హం. ఇప్పటికే పలుమార్లు విజిలెన్స్ విద్యుత్ శాఖ అధికారులు హెచ్చరించి, పలువురి అధికారులు, క్రింది స్థాయి సిబ్బందిపై కేసును నమోదు చేసినా వారి పనితీరు మాత్రం మారడం లేదని ప్రజలు నుంచి ఆరోపణలు వినిపిస్తున్నాయి.

మండల పరిధిలోని లంకల కలవగుంట, ఉరివి గ్రామాలను కలిపి ఆర్అండ్‌బి రహదారి పక్కనే రామాలయం ఉంది. రామాలయానికి ఆనుకుని రొయ్యల చెరువును గత కొన్నేళ్లుగా సాగు చేస్తున్నారు. అయితే విద్యుత్ శాఖ అధికారులు ఈ చెరువుకు ఓల్టేజ్ పెంచాలని సిఫార్సు చేశారు. దీంతో సంబంధిత బడా రైతు ట్రాన్స్ఫార్మర్ నిర్మించి ఈ చెరువుకు విద్యుత్ ఏర్పాటు చేసుకున్నారు. ఇదే అదునుగా భావించిన సంబంధిత రొయ్యల చెరువుల యజమాని ట్రాన్స్ఫార్మర్ నుంచి అర కిలోమీటరు పైగా మరో రెండు చెరువులను తవ్వించాడు. వీటికి విద్యుత్ అవసరం కావడంతో ఇదే సర్వీస్ నెంబరు, ట్రాన్స్ఫారం నుంచి మరో రెండు చెరువులో కూడా ఇక్కడ నుంచి విద్యుత్ వైర్లను ఏర్పాటు చేసి చెరువులకు అవసరమయ్యే ఏరియాటర్లు అలాగే మోటర్లు, కాంతుల లైట్లను ఏర్పాటు చేశారు. అయితే ఈ అర కిలోమీటర్ పొడవునా విద్యుత్ శాఖ నిబంధనల ప్రకారం దాదాపు పది విద్యుత్ స్తంభాలు మరో ట్రాన్స్ఫార్మర్ నిర్మాణంలో ఉండాలి ఇందుకు దాదాపు ఏడు నుంచి పది లక్షల వరకు ఖర్చు అవుతుందని అధికారులు చెబుతున్నారు. ఈ నగదు ప్రభుత్వ విద్యుత్ శాఖ పేరుతో డిడి రూపంలో చెల్లించాల్సి ఉంది. అనంతరం అనుమతులు పొందిన తదుపరి స్తంభాలు ఏర్పాటు చేసి లైన్లను అలాగే ట్రాన్స్ఫార్మర్లను బిగిస్తారు. ఇదంతా ప్రభుత్వం నిబంధన ప్రకారం దాదాపు నాలుగు నెలల కాలం పడుతుంది. అయితే వీటన్నిటిని పట్టించుకోకుండా వ్యవసాయ గట్లు పంట మురుగు కాలవ గట్లపై విద్యుత్ వైర్లను ఏర్పాటు చేస్తున్నారు. అంతేకాకుండా వీటిని అనుసంధానం చేసిన ప్రాంతాల్లో టేపు కూడా వేయకపోవడంతో మార్గమధ్యలో ప్రయాణించే రైతులు కూలీలు చూసి బెంబేలెత్తిపోతున్నారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు అనుమతులకు విరుద్ధంగా ఉన్న వీటిపై చర్యలు తీసుకుంటారో లేక మామూళ్లకు లోబడి రైతుల ప్రాణాలకు ముప్పు వాటిల్లేందుకు దోహదపడతారో అన్నది తేలాల్సి ఉంది. దీనిపై విద్యుత్ శాఖ మండల అధికారి శ్రీనివాసులు వివరణ కోరగా విద్యుత్ వైర్ల వలన ఆయా ప్రాంతాల్లోని రైతులు ఇబ్బందులు పడుతున్నామని లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేస్తేనే వాటిని తొలగిస్తామని వివరణ ఇచ్చారు.

వ్యవసాయ భూముల గట్లపై వెళ్లిన వైర్లు

విద్యార్థులకు కిట్లు పంపిణీ

ప్రజాశక్తి-కోడూరు: ఉన్నత స్థాయి నాణ్యతా ప్రమాణాలతో కూడిన విద్య అందిస్తున్న ప్రభుత్వ పాఠశాలల్లో తల్లిదండ్రులు తమ బిడ్డలను చేర్పాలని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ కోరారు. బుధవారం కోడూరు గ్రామపంచాయతీ పరిధిలోని స్వతంత్రపురం జడ్పీ హైస్కూలులో విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో స్టూడెంట్ కిట్స్ పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన బుద్ధప్రసాద్ మాట్లాడుతూ విద్యతోనే గుర్తింపు, గౌరవం లభిస్తుందన్నారు. పాఠ్య పుస్తకాలను మాత్రమే కాకుండా సమాజాన్ని చదివే అవకాశం, సమాజంలో స్థితిగతులు తెలుసుకునే అవకాశం ప్రభుత్వ పాఠశాలల్లో లభిస్తుందన్నారు. చదువుతో పాటు లోకజ్ఞానం నేర్చుకుని విద్యార్థులు పరిపూర్ణమైన జ్ఞానవంతులుగా తయారయ్యేందుకు ప్రభుత్వ పాఠశాలలు ఉత్తమ వేదికలుగా నిలుస్తాయన్నారు. అనంతరం విద్యా శాఖ ఆధ్వర్యంలో విద్యా ప్రవేశం ర్యాలీని బుద్ధప్రసాద్ ప్రారంభించి స్వతంత్ర పురం గ్రామంలో గల బాలురు, బాలికల వసతి గృహాలను సందర్శించి మెనూ వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్, మండల విద్యాశాఖ అధికారి రామదాసు, ప్రధానోపాధ్యాయులు ఆల రమణ పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ అధ్యక్షునిగా సాయిబాబు

ప్రజాశక్తి-కోడూరు

లయన్స్ క్లబ్ కోడూరు మండలానికి అధ్యక్షునిగా 2024-25 వ సంవత్సరానికి పదోసారి కోడూరు మండలానికి చెందిన సేవా దక్పథం కలిగిన పూతబోయిన సీతారత్న సాయిబాబును నియమిస్తున్నట్లు నియామక పత్రాలు అందజేసినట్లు లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ గద్దె శేషగిరిరావు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు రాజకీయ, ప్రముఖులు అభినందనలు తెలిపారు.

అతిసార ప్రబలకుండా ముందస్తు చర్యలు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు: అతిసార వ్యాపించకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని ఈవోపీఆర్డి కె దిలీప్ కుమార్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని వివిధ గ్రామాల కార్యదర్శులతో సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాతావరణం మార్పు వల్ల ప్రజలు

అనారోగ్యాలకు గురికాకుండా ఉండేందుకు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని తెలిపారు. పరిశుభ్రమైన తాగునీటిని అందించాలని, ప్రజలు కాచి చల్లార్చిన నీటిని వినియోగించాలని, మురుకు నీరు నిలువ ఉండకుండా తగు చర్యలు చేపట్టాలని సూచించారు. ఓవర్ ట్యాంకు లు శుభ్రపరచాలని అన్నారు. వర్షాల కారణంగా స్థానిక జేమ్స్ పేట రోడ్డు పక్కన మురికి నీరు నిల్వ ఉండటంతో ఆ ప్రాంతాల్లో తూము ఏర్పాటు బుధవారం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే ప్రతి గ్రామంలో మురుకు నీరు నిల్వ ఉండకుండా ఉండే విధంగా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు ఏజేయల్ నరసింహారావు, సి హెచ్ ఉమామహేశ్వరరావు, ఎలీషా రావు, ఎస్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ పల్లెకు రోటరీ క్లబ్ సేవలు : పొట్లూరి

ప్రజాశక్తి-గన్నవరం: రోటరీ సేవలు పల్లెలకు మరింత చేరువ కావాల్సిన అవసరం ఉందని ఏఎంసీ మాజీ ఛైర్మన్ పొట్లూరి బసవరావు అన్నారు.రోటరీ క్లబ్ ఆఫ్ గన్నవరం నూతన ప్రెసిడెంట్ టిఎస్ఆర్‌కె ప్రసాద్, సెక్రటరీ జి.వి.రవిబాబు బాధ్యతల స్వీకరణ, మాజీ ప్రెసిడెంట్ జాస్తి విజయ భూషణ్ కుమార్, సెక్రటరీ నర్రా సీతా రామారావు వీడ్కోలు, సన్మాన కార్యక్రమం బుధవారం కేసరపల్లిలో జరిగింది. పొట్లూరి బసవరావు మాట్లాడుతూ.. విజయ భూషణ్ కుమార్ ఆధ్వర్యంలో రోటరీ సేవలు విస్తృతంగా చేయడం పట్ల అభినందనలు తెలిపారు. బాగా పని చేశారని కితాబిచ్చారు. జీవితంలో ఎంత సంపాదించామనేది ముఖ్యం కాదని, ఎంత మందికి సహాయం చేశామనేది ముఖ్యమని పేర్కొన్నారు. విజయ భూషణ్ కుమార్ రోటరీ సేవలను పేదలకు చేరువ చేయడంలో సఫలమయ్యారని, ఆయన మనుమరాలు లాస్య కూడా సామాజిక సేవలకు తన వంతు సహాయం చేయడం గొప్ప విషయం అన్నారు. ప్రముఖ పారిశ్రామికవేత్త గూడపాటి తులసీ మోహన్ మాట్లాడుతూ.. రోటరీలో సభ్యుడుగా ఉండి పని చేయడం వల్ల జీవితంలో సంతృప్తి కలుగుతుందన్నారు. నూతన పాలకవర్గం కూడా బాగా పనిచేయాలని ఆకాంక్షించారు. అనంతరం జాస్తి విజయ భూషణ్ కుమార్ టీం ను ఘనంగా సన్మానించారు. జాస్తి విజయ భూషణ్ కుమార్ మనుమరాలు, ఎన్ఆర్ఐ శ్రీ లాస్య రూ.30 వేలు పాకెట్ మనీ రోటరీ సేవలకు అందించారు. అనంతరం రోటరీలో పనిచేస్తూ వివిధ రకాల సేవలు అందించిన దేవరపల్లి ఏసుబాబును సత్కరించారు. ఈ కార్యక్రమంలో రోటేరియన్స్ చింతపల్లి సీతారామయ్య, జగదీశ్వరరావు, చిగురుపాటి కుమారస్వామి, కాసరనేని బాబురావు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యం, డ్రైనేజీ వ్యవస్థ ప్రక్షాళనకు చర్యలు

- మంత్రి కొల్లు రవీంద్ర

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): మచిలీపట్నం నగరపాలక సంస్థ పరిధిలో పారిశుద్ధ్యం, డ్రైనేజీ వ్యవస్థ ప్రక్షాళనకు తగిన చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. బుధవారం ఆయన మచిలీపట్నం నగరపాలక సంస్థ 31వ డివిజన్ పరిధిలోని శారద నగర్ లో పర్యటించి ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్ నిర్వహించారు. స్థానిక నాయకులు, అధికారులతో కలిసి మొక్కను నాటారు. చీపురు పట్టి రోడ్డను శుభ్రం చేస్తూ పారిశుద్ధ్యం ప్రాముఖ్యతను తెలియజేశారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ మచిలీపట్నం నగరపాలక సంస్థ పరిధిలోని పారిశుద్ధ్యం, డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైందని, దీన్ని పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ క్రమంలోనే నగరపాలక సంస్థ పరిధిలోని 50 డివిజన్లకు అవసరమైన మేరకు వర్కర్లు, సూపర్వైజర్లను నియమించడం జరిగిందన్నారు. రహదారుల వెంబడి పిచ్చి మొక్కలు, చెత్తాచెదారంతో నిండి పోయిందని, వాటన్నింటినీ యుద్ధ ప్రాతిపదికన తొలగించి శుభ్రం చేయడం లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.జలాశయాల్లో నీటి కొరత నెలకొన్న పరిస్థితుల్లో మచిలీపట్నం పట్టణవాసులు నీటిని పొదుపుగా వాడుకోవాలని కోరారు. రానున్న కాలంలో సక్రమంగా నీటిని అందించి నీటి కొరతను తీరుస్తామని ఆయన హామీ ఇచ్చారు. జిల్లా వ్యాప్తంగా వ్యవసాయ పంట, మురుగు కాలువలు తూడు, పిచ్చి మొక్కలతో నిండిపోయాయని, ఏడు నియోజకవర్గాలకు మొత్తంగా సుమారు రూ. 13 కోట్ల మేర నిధులు అవసరం అయ్యాయని, అయితే ప్రస్తుతం మచిలీపట్నంకు సంబంధించి రూ.2 కోట్ల నిధులను సమకూర్చటం జరిగిందన్నారు. ఈ నిధులతో త్వరలో అందుకు సంబంధించిన పనులను వెంటనే చేపడతామన్నారు. తొలుత ఆయన డివిజన్లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు బండి రామకృష్ణ, మాజీ మున్సిపల్ ఛైర్ పర్సన్ మోటమర్రి బాబా ప్రసాద్, గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్ పర్సన్ గొర్రెపాటి గోపీచంద్, మాజీ మార్కెట్ యార్డ్ ఛైర్మన్ గోపి సత్యం, నగరపాలక సంస్థ కమిషనర్ బాపిరాజు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనుల్లో పాల్గొన్న మంత్రి కొల్లు రవీంద్ర

మాదకద్రవ్యాల నివారణకు ర్యాలీలు

వన్‌టౌన్‌లో ర్యాలీలో పాల్గొన్న పోలీసులు

ప్రజాశక్తి- వన్‌టౌన్ : డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని విజయవాడ కమిషనరేట్ వెస్ట్ జోన్ డీసీపీ టి.హరికృష్ణ అన్నారు. విజయవాడ పోలీస్ వెస్ట్ డివిజన్, కేబీఎన్ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని అవగాహనా ర్యాలీని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన డీసీపీ హరికృష్ణ ర్యాలీని ప్రారంభించారు. ర్యాలీలో పోలీసు సిబ్బంది, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీ. నారాయణరావు అధ్యక్షత వహించారు. వెస్ట్ జోన్ ఏసీపీ పీ మురళీకష్ణారెడ్డి, కొత్తపేట సీఐ టీ. గణేష్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. వెంకటేశ్వరరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్స్ డీ. పవన్‌కుమార్, ఎన్. సాంబశివరావు పాల్గొన్నారు. **రెడ్డిగూడెం :** మత్తు పదార్థాలు సేవించించడం వల్ల భవిష్యత్తు అంధకారం అవుతుందని రెడ్డిగూడెం ఎస్ఐ ఎస్.గోవింద్ అన్నారు. అంతర్జాతీయ మత్తు పదార్థాల వినియోగ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా రెడ్డిగూడెం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నవజీవన్ బాలభవన్ – ఫ్రెండ్స్ సర్వీస్ సొసైటీ స్వచ్ఛంద సేవా సంస్థల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. **మైలవరం :** మత్తు పదార్థాలకు అలవాటు పడి విలువైన జీవితాలను చిత్తు చేసుకోవద్దని మైలవరం సర్కిల్ ఎసిపి మురళీమోహన్ పేర్కొన్నారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం స్థానిక వివిఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించి ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. **నందిగామ :** మాదక ద్రవ్యాలు నియంత్రణకు యువత సహకరించాలని నందిగామ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి షేక్ రియాజ్ పేర్కొన్నారు. అవగాహన సదస్సు నిర్వహించారు. నందిగామ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జాయింట్ సెక్రెటరీ ఎక్కిరాల హనుమంతరావు అధ్యక్షతన, నందిగామ తేజ డివిఆర్ కళాశాల నందు కళాశాల ప్రిన్సిపాల్ వలి సహకారంతో అంతర్జాతీయ మాదక ద్రవ్యాలు , డ్రగ్స్ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా కళాశాల నందు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నందిగామ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి షేక్ రియాజ్ పాల్గొని విద్యార్థులకు యాంటీ డ్రగ్స్, న్యాయ సలహాలు సూచనలు అందించారు. మత్తు పదార్థాలకు దూరంగా వుండాలని కోరారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా నందిగామ పోలీస్ ఆధ్వర్యంలో విద్యార్థులతో పట్టణంలో పురవీధుల్లో ర్యాలీగా తిరుగుతూ ప్రజలకు అవగాహన కల్పించారు. గాంధీ సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐ హనీష్, ఎన్ఫోర్స్మెంట్ సిఐ కె. కోటేశ్వర, ఎస్ఐలు దుర్గారావు, ఫణి భూషణ్, ట్రాఫిక్ ఎస్ఐ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది, మహిళా పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. **కంచికచర్ల :** అంతర్జాతీయ మాదకద్రవ్యాల దినోత్సవం సందర్భంగా పోలీసు కమిషనర్ పి.రామకృష్ణ ఆదేశాల ప్రకారం రూరల్ జోన్ డిసిపి, కె.శ్రీనివాసరావు పర్యవేక్షణలో, నందిగామ ఏసిపి, రవికిరణ్ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల వినియోగం దుష్పరిణామాలను తెలుపుతూ ప్రజలకు మాదకద్రవ్యాల పట్ల అవగాహన కల్పిస్తూ కంచికచర్ల గ్రామంలోని ప్రధాన రహదారిపై ర్యాలీ నిర్వహించారు. **జగ్గయ్యపేట :** అంతర్జాతీయ మాదక ద్రవ్య దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా కోదాడ రోడ్డులో గల విశ్వభారతి డిగ్రీ కళాశాల, మండవ ఇంజినీరింగ్ కళాశాలలో జగ్గయ్యపేట స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఆధ్వర్యంలో సెమినార్ నిర్వహించారు. 'సాక్ష్యం స్పష్టంగా ఉంది– ముందస్తు నివారణ చర్యలకు కృషి చేద్దాం' అనే ఇతివృత్తంగా ఈ సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సందేహాలను నివత్తి చేశారు. ఈ కార్యక్రమం డ్రగ్స్ రహిత సమాజం దిశగా విద్యార్థుల నుండి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో జగ్గయ్యపేట స్పెషల్ ఫోర్స్ మెంట్ బ్యూరో ఇన్‌స్పెక్టర్ ఎస్.మణికంఠ రెడ్డి, సబ్ ఇన్‌స్పెక్టర్ జి.సునీల్ కుమార్, సిబ్బంది, విశ్వభారతి కళాశాల చైర్మన్ రంగాపురం నరసింహారావు, విశ్వ భారతి కళాశాల ప్రిన్సిపాల్ తిరుపతిరావు, జగ్గయ్యపేట మెప్మా సిఎంఎం శ్రీధర్ పాల్గొన్నారు. జగ్గయ్యపేట పోలీస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. **ఇబ్రహీంపట్నం :** అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్ పోలీస్ కమిషనరేట్ పిహెచ్ డి రామకష్ణ వారి ఆదేశానుసారం ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ వారి తరపున మాదకద్రవ్యాల దుర్వినియోగం పై ప్రజలకి అవగాహన కల్పించుట కొరకు సెండ్ జేవియర్ స్కూల్ చైతన్య స్కూల్ ఆక్స్ఫర్డ్ స్కూల్ విద్యార్థులతో ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ సిఐ ఎం సత్యనారాయణ ఎస్సై బి అనూష, సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. **విజయవాడ :** చిత్తరంజన్ గ్రేడ్ –2 శాఖ గ్రంథాలయం సత్య నారాయణ పురంలో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయ అధికారి మొదటిగా సిబ్బంది, పాఠకులచే "మత్తు రహిత భారత దేశం ప్రతిజ్ఞ " చేయించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి పి. సంపత్ కుమార్, సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

చేతిపంపు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

చేతి పంపు ఏర్పాటు

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : రెడ్డిగూడెం మండల పరిధిలోని కుదప గ్రామంలో గట్టు బజారులో నూతనంగా చేతి పంపు ఏర్పాటు చేశారు. దీంతో ఆ ప్రాంతంలో మంచినీటి సమస్య పరిష్కారం అయినట్లు సర్పంచ్ రాధమ్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి – 2 పాటిబండ్ల శ్రీనివాసరావు, వైసిపి మండల అధ్యక్షులు బలగని తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

మానవహారంగా ఏర్పడిన విద్యార్థులు

పరిశుభ్రతతోనే అతిసార దూరం

ప్రజాశక్తి - వత్సవాయి : ఇటీవల గ్రామంలో పెరుగుతున్న డయేరియా కేసులు దృష్ట్యా మక్కపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో ఉపాధ్యాయులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో ప్రధానోపాధ్యాయుడు చిత్రాల వెంకటేశ్వరావు మాట్లాడుతూ అతిసార వ్యాధికి కారణాలు, లక్షణాలు, తీసుకోవలసిన జాగ్రత్తల గురించి విద్యార్థులకు తెలిపారు. వ్యక్తిగత పరిశుభ్రత, వేడి వేడి ఆహార పదార్థాలు తినడం, చేతుల పరిశుభ్రత, బహిరంగ మల విసర్జన చేయకపోవడం, నీరు కలుషితమవుతున్న నేపథ్యంలో కాచి చల్లార్చిన నీటిని తాగడం వంటి చిన్న చిన్న జాగ్రత్తలతో డయేరియాను తరిమి కొట్టొచ్చని సూచించారు. గ్రామంలోని నాలుగు రోడ్ల కూడలిలో నిర్వహించిన మానవహారానికి ముఖ్యఅతిథిగా వత్సవాయి మండల విద్యాశాఖ అధికారి ఎల్.నాగరాజు పాల్గొని విద్యార్థులకు, గ్రామస్తులకు డయేరియాపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, ఎఎన్ఎం, ఆశా వర్కర్లు, ఉపాధ్యాయులు, పిడివి.ప్రసాద్, అజ్మీర్ శ్రీనివాసరావు, గజ్జెల దుర్గారావు, ధారావత్ శ్రీనివాసరావు, షేక్ జాన్ తదితరులు పాల్గొన్నారు.

అతిసారపై అవగాహన

ప్రజాశక్తి - జగ్గయ్యపేట:

పట్టణంలో జివిజే జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలుర)లో వైద్య, విద్య అధికారులు డయేరియాపై అవగాహన కార్యక్రమం, ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టిడిపి జాతీయ కోశాధికారి, శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ తాతయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజగోపాల్ మాట్లాడుతూ కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని, ఆహారం తినే ముందు, తిన్న తర్వాత చేతులు శుభ్రం చేసుకోవాలన్నారు. నిల్వ ఉన్న, పాడైపోయిన ఆహార పదార్థాలు తినరాదు. ఇంటి పరిసర ప్రాంతాలలో నీళ్లు నిలువ లేకుండా చూసుకుంటూ ఇంటి పరిసరాలను బ్లీచింగ్, ఫినాయిల్‌తో శుభ్రపరచుకోవాలన్నారు. అనంతరం వాటర్ ట్యాంకు చుట్టుపక్కల పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వైద్య విద్య అధికారులు, ఎన్‌డిఎ కూటమి నాయకులు పాల్గొన్నారు. తిరుమలగిరి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి.సిహెచ్.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ప్లకార్డులు, స్లోగన్స్‌తో ప్రజలకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. మండలంలోని ధర్మవరప్పాడు, షేర్ మహమ్మద్ పేట గ్రామాల్లోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కసుకుర్తి మంగతాయారమ్మ, సీతారాములు ఆధ్వర్యంలో డయేరియా నివారణపై అవగాహన కల్పించారు. విద్యార్థులు గ్రామవీధుల్లో అవగాహన కల్పించారు.

యుటిఎఫ్ సభ్యత్వ నమోదు ప్రారంభం

ప్రజాశక్తి - తిరువూరు :

ఆంధ్రప్రదేశ్ఐక్య ఉపాధ్యాయ పెడరేషన్ (యూటీఎఫ్) తిరువూరు మండల సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని యూటీఎఫ్ నేతలు బుధవారం ప్రారంభించారు. గత ప్రభుత్వం ఉపాధ్యాయులపై బలవంతంగా ఉపయోగించిన 117 జీవో రద్దు చేయాలని, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని, ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు మాత్రమే అమ్మఒడి అమలు చే యాలని, ఉపాధ్యాయులను బోధ నేతరపనుల నుండి విముక్తి చేయాలని, ఎంటిఎస్ ఉపాధ్యాయులను రెగ్యులర్ చేయాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని యూటీఎఫ్ నేతలు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ ఎన్టీఆర్ జిల్లా గౌరవాధ్యక్షులు మచ్చా శ్రీనివాస్, ఉపాధ్య క్షురాలు డి.అపర్ణ, మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రాయల వినయ్‌కుమార్, పి.నాగేశ్వరరావు, మండల గౌరవ అధ్యక్షులు ఎస్.కె.బాజీ, డి.నాగరాజు, టీవీ రమేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఇవి భరత కుమారి, ఉషారాణి, ప్రమీల, మృదుల, తదితరులు పాల్గొన్నారు.

ఎంఎల్ఎ శ్రీరామ్‌కు సన్మానం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట :

జగ్గయ్యపేట శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ తాతయ్య దంపతులను బుధవారం ఘనంగా రజిత కిరీటంతో ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షులు చిన్ని రామ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. చిన్నితో పాటు ఆయన మిత్రబృందం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ కోశాధికారి నుదురుపాటి శ్రీనివాస్, అదనపు కోశాధికారి నారాయణ విశ్వేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్ కంచర్ల ముత్య ప్రసాద్, ఎన్టీఆర్ జిల్లా ఆర్యవైశ్య సంఘ అధ్యక్షులు బుగ్గవరపు రాజా, బాపట్ల జిల్లా అధ్యక్షులు తూనుగుంట్ల శ్రీనివాస్, ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికులను కొనసాగించాలి

అధికారికి వినతిపత్రం ఇస్తున్న సుప్రజ, తదితరులు

ప్రజాశక్తి - విజయవాడ : పాఠశాలల్లో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన పథకం కార్మికులను యధాతథంగా కొనసాగించాలని కోరుతూ ఎన్టీఆర్ జిల్లా విద్యాశాఖ అధికారి యు.వి.సుబ్బారావుకు సిఐటియు ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన ఏజెన్సీ కార్మికులు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా మధ్యాహ్నం భోజనం వర్కర్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.సిహెచ్.సుప్రజ మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకం కార్మికులు 23 సంవత్సరాలుగా ప్రైమరీ, అప్పర్ ప్రైమరీ, హైస్కూల్లోని విద్యార్థులకు ప్రభుత్వ మెనూ ప్రకారం ఆహారాన్ని వండిపెడుతున్నారని తెలిపారు. వీరంతా బడుగు, బలహీన వర్గాలకు చెందిన మహిళలే. కూరగాయలు, నిత్యావసర సరుకుల ధరలు రోజురోజుకూ పెరుగుతున్నాయన్నారు. మౌలిక సదుపాయాలు సక్రమంగా లేకపోయినా, ప్రభుత్వం నుండి బిల్లులు సకాలంలో రాకపోయినా అప్పులు తెచ్చి ఆర్థికంగా అనేక ఇబ్బందులు పడుతూ వంట చేసి పెడుతున్నారన్నారు. అనేక సంవత్సరాలుగా దీనినే నమ్ముకుని జీవిస్తున్నారని వివరించారు. అయితే నూతన ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రస్తుతం పనిచేస్తున్న మధ్యాహ్న భోజన పథకం కార్మికులను పని నుండి తొలగిస్తామని అక్కడక్కడ కొందరు మాట్లాడుతున్నారని, కార్మికులను తొలగించడం సరైంది కాదని, పాత వారినే కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా సిఐటియు కార్యదర్శి కె.గోపాల్, సిఐటియు జిల్లా నాయకులు సోమేశ్వరావు, సిఐటియు నాయకులు వేల్పుల ఏసోబు, నాంగేద్రం, సత్యవతి, లక్ష్మి, పార్వతి, మంగ, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

60 మందికి వైద్య సేవలు

ప్రజాశక్తి - గంపలగూడెం : ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం కార్యక్రమంలో భాగంగా 60 మందికి వైద్య సేవలు అందించినట్లు స్థానిక పిహెచ్‌సి వైద్యాధికారి పి.భార్గవి తెలిపారు. షుగర్, బిపి, జ్వరం తదితర సాధారణ జబ్బులను పరిశీలించి, మందులు అందజేసినట్లు వివరించారు. బుధవారం అమ్మిరెడ్డిగూడెం గ్రామంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

మొక్కలు నాటుతున్న విద్యార్థులు

పర్యావరణాన్ని రక్షించాలి

ప్రజాశక్తి - తిరువూరు : తిరువూరు ఐడియాస్ సేవా సంస్థ ఆధ్వర్యంలో లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీ విద్యార్థులు సామాజిక సేవలో భాగంగా తిరువూరులోని పలు ప్రదేశాల్లో బుధవారం మొక్కలు నాటారు. వృక్షో రక్షతి రక్షిత: అనే నినాదంతో ఈ కార్యక్రమం చేపట్టినందుకు భగత్ సింగ్ కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు. గ్లోబల్ వార్మింగ్ కారణంగా అందరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరీక్షించాలని ఐడియాస్ సంస్థ డైరెక్టర్ శౌరి సూచించారు. ఈ కార్యక్రమంలో లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీ విద్యార్థులు గాలిబ్ భాష, బాలాజీ, ప్రభు రాజ్ కుమార్, ఐడియా సేవా సంస్థ కోఆర్డినేటర్ పండు వరప్రసాద్ పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలను సమాజం నుండి తరిమికొడదాం

బందరులో ర్యాలీ

గన్నవరంలో మాట్లాడుతున్న జడ్జి శ్రీనివాసబాబు

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)
యువతను నిర్వీర్యం చేస్తున్న మాదకద్రవ్యాల వాడకాన్ని నియంత్రిస్తూ, యువతను చిత్తు చేస్తున్న మత్తు వ్యసనాలను సమాజం నుంచి తరిమికొట్టాలని జిల్లా న్యాయ సేవాదికార సంస్థ కార్యదర్శి కె.వి.రామకృష్ణయ్య పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మచిలీపట్నం నగరంలో కృష్ణాజిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి అదేశాను సారం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. అనంతరం కోనేరు సెంటర్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా రామకృష్ణయ్య మాట్లాడుతూ పిల్లల నుండి పెద్దవారి వరకు డ్రగ్స్ వినియోగం అధికంగా ఉంది వారికున్న ఒత్తిడిని, బాధలను తగ్గించుకోవడానికి మద్యం, సిగరెట్, ఇతర మాదకద్రవ్యాలను ఉపయోగిస్తూ తాత్కాలిక ఉపశమనం పొందుతూ ఉంటారు. కానీ అది వదులుకోలేని వ్యసనంలా మారిపోతుందని తద్వారా వారి భవిష్యత్తు అంధకారం అవుతుందన్నారు. ఈ మాదక ద్రవ్యాల వల్ల కలిగే దుష్ప్రభావాల గురించి విద్యా సంస్థలు, ప్రధాన కూడళ్ల వద్ద అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తూ ప్రజలను చైతన్యం చేయడం జరుగుతుందన్నారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కేవలం వినియోగించే వారి జీవితమే కాకుండా, వారి పై ఎన్నో ఆశలు పెట్టుకున్న వారి కుటుంబ పరువు ప్రతిష్ట దెబ్బ తింటుందన్నారు. తల్లిదండ్రులు మీ పిల్లలను తరచు గమనిస్తూ మాదకద్రవ్యాల జోలికి పోకుండా అవగాహన కల్పించాలన్నారు. అడిషనల్ ఎస్పీ జి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ డ్రగ్స్ మొదట అలవాటుగా మారి క్రమేణా వ్యసనంలా మారిపోతుందన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి తాహెరా సుల్తానా మాట్లాడుతూ ప్రపంచం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య మాదకద్రవ్యాల వినియోగమన్నారు. వీటి వినియోగం వల్ల ఎంతో మంది యువత వారి భవిష్యత్తును చీకటిమయం చేసుకుంటున్నారని చెప్పారు. ప్రతి ఒక్కరు మేల్కొని మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీలు అబ్దుల్ సుభాన్, రమేష్, అసిస్టెంట్ స్కూల్ గేమ్స్ సెక్రెటరీ సి అజయ్ కుమార్, స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో సూపరింటెండెంట్ జి గంగాధరావు తదితరులు పాల్గొన్నారు. **ఘంటసాల:** నేటి యువత డ్రగ్స్, మాదకద్రవ్యాలకు బానిసలై తమ విలువైన జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, వారిని కన్న తల్లిదండ్రులకు, కుటుంబ సభ్యులకు కన్నీళ్లను మిగులుస్తున్నారని గోగినేనిపాలెం జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు తమ్మన వేణుగోపాలరావు ఆవేదన వ్యక్తం చేశారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా గోగినేనిపాలెం జడ్పీహెచ్ స్కూల్ వద్ద విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ యువత ఎవ్వరూ కూడా డ్రగ్స్, మాదకద్రవ్యాలకు అలవాటు కాకుండా, వారి యొక్క విలువైన జీవితాలను నాశనం చేసుకోకుండా, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని నేటి యువతకు సూచించారు. అనంతరం మత్తుపదార్థాలకు వ్యతిరేకంగా యువతను చైతన్యపరచే ప్రతిజ్ఞ చేయించారు. **బంటుమిల్లి:** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ప్రపంచ మాదకద్రవ్యాల నివారణ దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ జగన్మోహన్‌రావు, వైస్ ప్రిన్సిపాల్ బండి దేవ జయరాజు, కోఆర్డినేటర్ హిమాలనీ దేవి, ప్రోగ్రాం ఆఫీసర్ జిబి ఆనంద్‌కుమార్ పాల్గొన్నారు. **అవనిగడ్డ:** అవనిగడ్డలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కళాశాల జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.ఉమారాణి అధ్యక్షత వహించారు. స్పెషల్ ఎక్సైజ్ బ్యూరో సిఐ వివి సత్యనారాయణ ఎస్సై సిబ్బంది పాల్గొని మాదక ద్రవ్యాల వలన కలిగే దుష్పరిణామాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ వీర కుమారి పాల్గొన్నారు. **గన్నవరం:** మాదకద్రవ్యాల నియంత్రణకు విద్యార్థులు కీలకపాత్ర పోషించాలని గన్నవరం మెట్రోపాలిటన్ సివిల్ జడ్జి శ్రీనివాసబాబు అన్నారు. మాధక ద్రవ్యాలు నియంత్రణ, సరఫరా నివారణ దినోత్సవం సందర్భంగా బుధవారం గన్నవరం బాలుర ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిధి ఆయన హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా జరిగిన సభకు గన్నవరం బార్ అసోసియేషన్ అధ్యక్షులు మూర్తి అధ్యక్షత వహించారు. శ్రీనివాసబాబు తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ క్రమ శిక్షణతో విద్య నభ్యసించినవారు ఉన్నతమైన స్థానాలలో నిలుస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంఛార్జ్ ప్రధాన ఉపాధ్యాయురాలు మౌనిక కృష్ణకుమారి, గన్నవరం మండల విద్యా శాఖధికారులు రవికుమార్, కమల బార్ అసోసియేషన్ కార్యదర్శి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

పనులను నిలిపివేయిస్తున్న అధికారులు

మట్టి ట్రాక్టర్ సీజ్

'ప్రజాశక్తి' వార్తకు స్పందన

ప్రజాశక్తి-పెడన: తహశీల్దార్ రాంబాబు ఆదేశాల మేరకు పట్టణ, రూరల్ మండలంలో అక్రమంగా తరలిస్తున్న మట్టి ట్రాక్టర్లను సీజ్ చేశారు. బుధవారం ప్రజాశక్తి దినపత్రికలో వచ్చిన 'రెచ్చిపోతున్న మట్టి మాఫియా' కథనంపై స్పందించిన తహసిల్దార్ అర్బన్, రూరల్ మండలాల్లోని వీఆర్వోలు, సిబ్బందితో కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. అనుమతులు లేకుండా చేపల చెరువులు, మట్టి తవ్వకాలు జరిగితే ఉపేక్షించేది లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల పరిధిలోని కాకర్లమూడి నుంచి పెడన వస్తున్న బుసక ట్రాక్టర్‌ను వీఆర్వో కట్టా వీరబాబు సీజ్ చేశారు. ఈ వాహనాన్ని తాసిల్దార్ కార్యాలయానికి తరలించి జరిమానా విధించారు. పట్టణంలోని ఒకటో వార్డులో అర్బన్ విఆర్ఓ గుల్ల ఏసుపాదం బుసక మట్టి తోలుతున్న ఒక ట్రాక్టర్, జెసిబిను అడ్డుకున్నారు.

సిఎంకు స్వాగతం

ప్రజాశక్తి-గన్నవరం: బెంగళూరు నుండి ప్రత్యేక విమానంలో గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయంకు సిఎం చంద్రబాబు బుధవారం వచ్చారు. కుప్పంలో రెండు రోజులు పర్యటన ముగించుకొని గన్నవరం విమనాశ్రయానికి చేరుకున్నారు. అనంతరం రోడ్డు మార్గాన ఉండవల్లి నివాసానికి బయలుదేరి సిఎం వెళ్లారు. సిఎంకు పలువురు స్వాగతం పలికారు.

శాయాజీ సేవలు అభినందనీయం

ప్రజాశక్తి-ఘంటసాల: దేవరకోటకు చెందిన ఎన్నారై దోనేపూడి శాయాజీ సామాజిక సేవలు అభినందనీయమని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జె. శ్రీనివాసరావు తెలిపారు. ఘంటసాల బాలుర ప్రాథమిక పాఠశాలలో ఒకటవ తరగతి నుంచి 5వ తరగతి వరకు గల విద్యార్థినీ విద్యార్థులకు ఎన్నారై దోనేపూడి శాయాజీ ఆధ్వర్యంలో ఆయన తల్లిదండ్రులు దోనేపూడి మునేశ్వరమ్మ, వెంకటేశ్వరరావు జ్ఞాపకార్థం రూ.5 వేలు విలువ గల రాత పుస్తకాలు, పలకలు, విద్యాసామాగ్రిని ప్రముఖులు దోనేపూడి మురళీకృష్ణ, దోనేపూడి గిరీష్ చేతుల మీదుగా బుధవారం అందజేశారు. పాఠశాల ఉపాధ్యాయిని ముసునూరు సునీత విన్నపంతో విద్యార్థినీ విద్యార్థులకు రాత పుస్తకాలను, విద్యా సామాగ్రిని అందజేసినట్టు దాతలు తెలిపారు.

శ్రీ చైతన్య విద్యార్థులకు జాతీయస్థాయి బహుమతి

ప్రజాశక్తి-చల్లపల్లి: చల్లపల్లి మండలం లక్ష్మీపురం శివారు రామానగరంలోని శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులకు నాసా స్పేస్ కాంటెస్ట్‌లో జాతీయస్థాయిలో మొదటి బహుమతి సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ద్రాక్షాయని, హవీష్, శ్రీ సిద్ధిష్, కామిత్యా, సుచస్మిత, దేదీప్య, శక్తి కుమార్‌లను పాఠశాల సిబ్బంది బుధవారం అభినందించారు. విద్యార్థులు తయారు చేసిన స్పేస్ హొటల్ అనే అంశానికి జాతీయస్థాయిలో మొదటి బహుమతి లభించింది. ఈ సందర్భంగా స్కూల్ ప్రిన్సిపల్ డి సురేష్ మాట్లాడుతూ జాతీయస్థాయిలో మొదటి బహుమతి సాధించిన విద్యార్థిని విద్యార్థులను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఏజిఎం మురళీకృష్ణ, ఆర్ఐ రాజేష్, అకాడమిక్ కోఆర్డినేటర్ అశోక్, డీన్ రమ్య పాల్గొన్నారు.

99 మందికి ఉద్యోగావకాశం

ప్రజాశక్తి-గుడివాడ: యువతకు ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను వినియోగించుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాని జిల్లా ఉపాధి కల్పన అధికారి దేవరపల్లి విక్టర్ బాబు అన్నారు. బుధవారం కెబిఆర్ గవర్నమెంట్ ఐటిఐ కళాశాలలో జిల్లా నైపుణ్యాభివద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కల్పన శాఖ సంయుక్త ఆధ్వర్యంలో కాంపస్ ప్లేస్ మెంట్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా విక్టర్‌బాబు మాట్లాడుతూ జాబ్ మేళాలో దాదాపు 180 మంది అభ్యర్థులు పాల్గొన్నారని, వారిలో 99 మంది అభ్యర్థులు ఎంపికయ్యారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాధికారి ఎస్.శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ ఎల్.గౌరిమణి, 12 కంపెనీల ప్రతినిధులు, ఉపాధి కల్పన కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అచ్చంపాలెం కార్యదర్శిగా శ్రీనివాసరావు

ప్రజాశక్తి-ఘంటసాల: ఘంటసాల మండల పరిధి అచ్చంపాలెం గ్రామ కార్యదర్శిగా నూతనంగా బాధ్యత స్వీకరించిన రాజులపాటి శ్రీనివాసరావును గ్రామ సర్పంచ్ గాజుల నాగ శ్రీనివాసరావు వార్డు సభ్యులు గ్రామస్తులు బుధవారం ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ నూతనముగా నియమితులైన పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావుకు పాలకమండలి నుంచి మా గ్రామస్తుల నుంచి పూర్తి సహాయ సహకారాన్ని ఇస్తామన్నారు. అలాగే కార్యదర్శి గ్రామ అబివృద్ధికి తోడ్పాటు అందించాలని ఈ సందర్భంగా కోరారు.

బకాయిలు చెల్లించాలని రైతులు వినతి

ప్రజాశక్తి-గన్నవరం: నీరు చెట్టు పెండింగ్ బిల్లులపై సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు ఆళ్ళ వెంకట గోపాలకృష్ణారావు బుధవారం సచివాలయంలో మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణారావు మాట్లాడుతూ గత టిడిపి ప్రభుత్వంలో అన్ని రకాల అనుమతులు ఇచ్చి జీవో నెంబర్ 187 ద్వారా నీరు చెట్టు పథకంలో చెరువుల పూడికతీత,కాలువల పూడిక తీత, చెక్ డ్యాముల నిర్మాణం,పంట కుంటల నిర్మాణం తదితర నీటి సంరక్షణ పనులకును ఉమ్మడి 13 జిల్లాలలోని రైతులు,నీటి సంఘాల ప్రతినిధులు 18,544 పనులను రూ.1,303 కోట్లతో పూర్తిచేసి సి.ఎఫ్.ఎం.ఎస్ టోకెన్ పడిన తరువాత బిల్లుల కోసం వేచి చూస్తున్న సమయంలో 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం రకరకాల మెమోలతో కక్ష సాధింపు చర్యలు చేసి నిలుపుదల చేయగా అప్పటి తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు గారి ఆదేశాల మేరకు 2021లో రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నీరు చెట్టు పెండింగ్ బిల్లుల ఫిర్యాదుల విభాగం ఏర్పాటు చేసి బకాయిలు ఉన్న రైతులను సమన్వయం చేసి గత వైసిపి ప్రభుత్వం బిల్లులు



చెల్లించకపోవడంతో పనులు చేసిన రైతులు,నీటి సంఘాల ప్రతినిధులు రాష్ట్ర ప్రభుత్వంపై బిల్లులు చెల్లించమని హైకోర్టులో 9,391 రిట్ పిటిషన్లు వేయటం జరిగిందని, రాష్ట్ర గౌరవ హైకోర్టు ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో మరలా 6,625 మంది రైతులు కోర్టు ధిక్కరణ పిటిషన్లు వేయగా 2022 మార్చి నుంచి 2024 ఏప్రిల్ వరకు గత ప్రభుత్వం గతి లేని స్థితిలో 20 జీ.వోలు ఇచ్చి రైతులకు రూ.968 కోట్లు చెల్లించిందని ఇంకనూ రైతులకు రూ.427 కోట్లు చెల్లించాలని మంత్రి దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలియజేశారు.

విద్యార్థులు సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

ప్రజాశక్తి-ఉంగుటూరు: మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎప్పటికప్పుడు అందిపుచ్చుకుంటూ సరికొత్త ఆవిష్కరణలు రూపొందించే దిశగా విద్యార్థులు అధ్యయనాలు కొనసాగించాలని ఎపి ఇన్నోవేషన్ సొసైటీ సిఇఓ టి.అనిల్‌కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని ఉషా

రామా ఇంజనీరింగ్ కళాశాల లో ఇన్నోవేషన్ సొసైటీ కౌన్సిల్ వారు నిర్వహించిన ప్రత్యేక శిక్షణా తరగతులకు ముఖ్య అతిథిగా హాజరైన అనీల్ కుమార్ మాట్లాడుతూ ఎపి ఇన్నోవేషన్ సొసైటీ ఆధ్వర్యంలో ఆవిష్కరించి బడిన స్టార్టప్స్, ఇంట్రానెట్ ప్రెషర్, ఇన్నోవేటర్స్, మరియు స్కిల్ డెవలప్మెంట్ వాటిపై ప్రత్యేక అవగాహన అవసరం అని అన్నారు. ఈ అవగాహన ద్వారా ఎపి ఇన్నోవేషన్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించే పలు రకాల అవకాశాలు అందిపుచ్చుకుని ముందుకు సాగాలని ఆయన ఆకాంక్షించారు. ప్రముఖ పారిశ్రామికవేత్త శ్రీమతి శ్రిష్ణ సౌజన్య మాట్లాడుతూ పారిశ్రామిక వేత్తలు గా ఎలా ఎదగాలి అనేది విద్యార్థి దశలో నే అలవరుచుకోవాలి అని అన్నారు. ఈకార్యక్రమంలో ఎ ఆర్ కె చౌదరి, డైరెక్టర్ కుశలవ ఇంటర్నేషనల్ విజయవాడ వారు డాక్టర్ సాగర్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రసాద్, చైర్మన్ సుంకర రామబ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ సృజనకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ ఇఓ రామారావు

దుర్గమ్మను దర్శించుకున్న ఎన్టీఆర్ జిల్లా నూతన కలెక్టర్ సృజన

ప్రజాశక్తి - వన్‌టౌన్

శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రి శ్రీ కనకదుర్గ అమ్మవారి దర్శనార్థం ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డా.గుమ్మళ్ల సజన బుధవారం ఆలయానికి విచ్చేశారు. వీరికి ఆలయ ఇఒ కె.ఎస్ రామారావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి, శ్రీ అమ్మవారి దర్శనం కల్పించారు. శ్రీ అమ్మవారి దర్శనానంతరం వీరికి వేదపండితులు, అర్చకులు వేదాశీర్వచనం చేయగా, ఈవో శ్రీ అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు. అనంతరం ధర్మపదం కళావేదిక వద్ద కాకినాడ జిల్లా మధవపట్నం వాస్తవ్యులు తోట బాలకృష్ణ వారి బృందం వారిచే నిర్వహించిన తోలుబొమ్మల కథాగానం ప్రదర్శనను తిలకించారు. అనంతరం దుర్గగుడి ఇఒ కె.ఎస్. రామారావు అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు.

మంచినీటి సమస్యపై 50వ డివిజన్‌లో అధికారుల పర్యటన

ప్రజాశక్తి - వన్‌టౌన్

మంచినీటి సరఫరాలో ప్రజల ఇబ్బందులపై ఈనెల 24వ తేదీ సోమవారం సిపిఎం ఫ్లోర్ లీడర్ బోయి సత్యబాబు విఎంసి కమిషనర్ పుండ్కర్‌ను కలిసి ఫిర్యాదు చేసిన విషయం విధితమే. ఈ నేపథ్యంలో ప్రజల ఆందోళన మేరకు బుధవారం 50వ డివిజన్ కార్పొరేటర్ బోయి సత్యబాబుతో విఎంసి డి.ఈ, ఎఇ, సచివాలయం ఇమ్యూనిటీ సెక్రటరీలు 170, 177 సచివాలయం పరిధిలో పర్యటించారు. దీంతో స్థానిక ప్రజలు తమ మంచినీటి ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. స్థానిక ప్రజలు మంచినీరు సక్రమంగా అందడం లేదని, నీరు మురుగు వాసన వస్తున్నాయని తెలిపారు. మంచినీరు పరిశుభ్రమైనవి అందించాలని డిమాండ్ చేశారు. పలు వీధుల్లో కొత్త పైప్ లైన్లు వేసి తవ్వి వదిలేయడం వల్ల ప్రజలు ఇబ్బందులు గురి అవుతున్నారని వెంటనే తవ్విన రోడ్లు బాగు చేయాలని కార్పొరేటర్ బోయి సత్యబాబు అధికారులకు విజ్ఞప్తి చేశారు. దాసాంజనేయ వీధి ఇంటర్ కలెక్షన్ పనులు ఈ సందర్భంగా పరిశీలించారు. మంచినీటి కొరత నివారణకు వాటర్ ట్యాంక్‌లు పూర్తిగా రెండు పూటలా నిండే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రతి రిజర్వాయర్ 15 రోజులకు ఒకసారి క్లీనింగ్ చేయాలని విజ్ఞప్తి చేశారు.

మంచినీటి సమస్యను విఎంసి అధికారులను నిలదీస్తున్న కార్పొరేటర్ బోయిసత్యబాబు, స్థానిక మహిళలు

డ్రగ్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు కృషి : డిజిపి

ప్రజాశక్తి - విజయవాడ : కేంద్ర ఏజెన్సీల సహకారంతో గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల రవాణాను అణచి వేయడం జరుగుతుందని, ఆచరణలో ఎన్ని అవరోధాలు ఎదురైనా వాటిని అధిగమించి డ్రగ్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడానికి శక్తి వంచన లేకుండా కృషి చేయడం జరుగుతుందని రాష్ట్ర డిజిపి ద్వారకా తిరుమలరావు అన్నారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో కళాశాల విద్యార్థులకు 'మాదక ద్రవ్యాలకు దూరంగా వుండండి జీవితాన్ని కాపాడుకోండి' అనే నినాదంతో డ్రగ్స్ వినియోగం వలన కలిగే అనర్థాలపై ఎన్‌టిఆర్ జిల్లా పోలీసు కమిషనర్ పిహెచ్‌డి రామకృష్ణ ఆధ్వర్యంలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర డి.జి.పి ద్వారకా తిరుమలరావు మాట్లాడుతూ యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. విద్యార్థుల తల్లితండ్రులు అందరూ కలిసి ఈ మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాటం చేయాలన్నారు. డ్రగ్స్ సరఫరా చేసే వారి ఆటకట్టించడానికి ఎల్లవేళల సిద్ధంగా ఉన్నామని డ్రగ్ మాఫియాను అరికట్టడానికి ప్రజలు, విద్యార్థులు కలిసి పోలీస్ వారికి సహకరించాలని తెలిపారు. జిల్లా కలెక్టర్, ఎస్.పి. ఐ.టి.డి.ఎ., డి.ఎం. అండ్ హెచ్‌ఒ, ఇతర శాఖల, సమన్వయంతో ప్రతి జిల్లాలో నార్కో ఆర్డినేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేయడం, ఎఫ్.ఎస్.ఎల్, ఆర్.ఎఫ్.ఎస్.ఎల్. యొక్క సామర్థ్యం పెంచేందుకు మరిన్ని ప్రయోగశాలలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానానికి చర్యలు తీసుకోవడం జరుగుతుంది. పోలీస్ కమీషనర్ రామకృష్ణ మాట్లాడుతూ విచ్చలవిడి తనానికి అలవాడు పడి మాదకద్రవ్యాలకు బానిసలవుతున్న యువత మేల్కొని వారి జీవితాలను చక్క దిద్దికోకపోతే అదే మాదక ద్రవ్యాలకు బలైపోతారని, మత్తు వదలకపోతే బ్రతుకులు నాశనం అవుతాయని, నిషేధిత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. ఎన్.టి.ఆర్.జిల్లా పోలీసు వారు ఒక సంవత్సరం కాలంలో సుమారు 220 కేసులు నమోదు చేసి 900 మంది వరకు అరెస్ట్ చేస్తామని తెలిపారు. డ్రగ్స్, గంజాయి, తదితర మాదకద్రవ్యాల నివారణకు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు 100 రోజుల ప్లాన్ రెడీ చేస్తున్నట్లు తెలిపారు. ప్రముఖ మానసిక వైద్య నిపుణులు డా. ఇండ్ల రామసుబ్బారెడ్డి, అడిషనల్ డైరెక్టర్ అఫ్ ప్రాసిక్యూషన్ బైరా రామకోటేశ్వర రావు మాట్లాడారు. అనంతరం డి.సి.పి.శ్రీ కె.శ్రీనివాసరావు కార్యక్రమానికి వచ్చిన అందరితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డి.సి.పి.లు కె.శ్రీనివాసరావు, అధిరాజ్ సింగ్ రాణా, ఏ.బి.టి.ఎస్. ఉదయరాణి, టి.హరికృష్ణ, కె.చక్రవర్తి, ఏ.డి.సి.పి. కృష్ణమూర్తి నాయుడు, టి.కనకరాజు, ఏ.సి.పి.లు, ఇన్‌స్పెక్టర్లు సిబ్బంది సుమారు 1000 మంది కళాశాల విద్యార్థులు, పేరెంట్స్, ఫ్యాకల్టీస్, ఎన్.జి.ఓ.లు, డాక్టర్స్, అడ్వకేట్స్ , ఇతర సొసైటీ ఎల్డర్స్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ద్వారకా తిరుమలరావు

ప్రెస్‌క్లబ్ వార్షికోత్సవంలో అన్నదానం

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం: ప్రజాసేవకు జర్నలిస్టులు, రాజకీయ నాయకులు కలిసి పనిచేయాలని మైలవరం నియోజకవర్గ శాసనసభ్యులు వసంత వెంకటకష్ణ ప్రసాద్ కోరారు. ఇబ్రహీంపట్నం ప్రెస్‌క్లబ్ 4వ వార్షికోత్సవ వేడుకలను మీడియా సోదరులు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణ ప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన కేకులు కట్ చేసి, మీడియా సోదరులతో తమ భావాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా మీడియా సోదరులు అంకితభావంతో పని చేస్తున్నారని వారి సంక్షేమానికి తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని పేర్కొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే వసంత ప్రారంభించారు. వార్షికోత్సవం సందర్భంగా పేద ప్రజలకు అన్నదానం చేయడం అభినందనీయమన్నారు ఎమ్మెల్యేను ప్రెస్ క్లబ్ సభ్యులు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సూఫీ మత గురువులు అల్తాఫ్ బాబా, టిడిపి నాయకులు జంపాల సీతారామయ్య, చిట్టిబాబు, నారాయణ, శివ, ఇబ్రహీంపట్నం ప్రెస్ క్లబ్ ప్రెసిడెంట్ హఫీజ్ ఖాద్రీ, గౌరవ అధ్యక్షులు నాగేశ్వరావు, ఏవో భాష, కోశాధికారి రాంబాబు, ఉపాధ్యక్షుడు రవీంద్ర, జాయింట్ సెక్రెటరీలు క్రాంతి, సిరాజ్, గిరి కుమార్, శ్రీనివాస్, తదితర సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వేడుకల్లో వసంత, తదితరులు

స్థాయీ సంఘంలో స్థానం కల్పించాలని వినతి

ప్రజాశక్తి-విజయవాడ : విజయవాడ నగరపాలక సంస్థ సాయ్థి సంఘంలో టిడిపి సభ్యుల (కార్పొరేటర్లు)కు కూడా అవకాశం కల్పించాలని ఆపార్టీ ఫ్లోర్‌లీడర్ నెలిబండ్ల బాలస్వామి (బాల) కోరారు. ఈ మేరకు టిడిపి డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు (చంటి)తో కలిసి బాల నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మికి బుధవారం వినతిపత్రం అందజేశారు. ఇదే కాపీని నగర కమిషనర్, సెక్రటరీ సెల్‌కు పంపించారు. ఈ సందర్భంగా బాలస్వామి మాట్లాడుతూ నగరపాలక సంస్థ స్థాయి సంఘం సభ్యుల్లో టిడిపి సభ్యులకు కూడా అవకాశం కల్పించాలని కోరారు. నగరపాలక సంస్థ పరిధిలో 13 మంది టిడిపి కార్పొరేటర్లు ఉన్నారని అన్నారు. స్థాయి సంఘంలో నూతన సభ్యుల ఎన్నిక కోసం నోటిఫికేషన్ కూడా సెక్రటరీ సెల్ విడుదల చేసిందని అన్నారు. ఆ నోటిఫికేషన్ ఆధారంగా టిడిపి సభ్యులుగా కూడా నామినేషన్స్ దాఖలు చేస్తారన్నారు. టిడిపి తరుపున ఇద్దరికి చోటు కల్పించాలని కోరారు. వచ్చే నెల మొదటి వారంలో సభ్యుల ఎన్నికల నేపథ్యంలో నామినేషన్లు దాఖలు చేయనున్నట్లు తెలిపారు.

మేయర్‌కు వినతిపత్రం ఇస్తున్న బాలస్వామి

భవానీపురం సిఐగా ఉమామహేశ్వరరావు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - భవానీపురం : భవానీపురం పోలీస్‌స్టేషన్‌కు నూతన సర్కిల్ ఇన్స్‌పెక్టర్ (సిఐ)గా కె.ఉమా మహేశ్వర రావు బుధవారం పదవీ బాధ్య తలు స్వీకరించారు. ఆయన కోర్టు మానటరింగ్ సిస్టమ్ (సిఎంఎస్)లో విధులు నిర్వర్తించి, నేడు భవానీ పురం పోలీస్‌స్టేషన్‌కు సిఐగా వచ్చారు. ఇప్పటివరకూ భవానీ పురం పోలీస్‌స్టేషన్‌లో అతి కొద్దికాలం పాటు సిఐగా విధులు నిర్వహించిన ప్రసాద్ కుమార్ సెలవుపై వెళ్ళటంతో నగర పోలీస్ కమిషనర్ రామకృష్ణ ఆదేశాల మేరకు కె.ఉమా మహేశ్వర రావును భవానీపురం పీఎస్‌కు సిఐగా నియమించారు.

విద్యుద్ఘాతంలో లారీ డ్రైవర్ మృతి

ప్రజాశక్తి - గంపలగూడెం : విద్యుత్ షాక్‌తో లారీ డ్రైవర్ మృతి చెందినట్లు గంపలగూడెం ఎస్ఐ ఎన్. శ్రీనివాస్ తెలిపారు. ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం గుంటు పల్లి గోపవరం నుండి సుబాబుల్ లోడుతో వస్తున్న లారీకి విద్యుత్ వైర్లు తగలడంతో ఈ ప్రమాదం వాటిల్లి నట్లు చెప్పారు. కొమరం భీం జిల్లా కాగజ్ నగర్‌కు చెందిన అబ్దుల్లాబీన్ అహ్మద్ (64)గా వివరించారు. సుబాబుల్ కర్రను కాగజ్ నగర్ జెకె మిల్లుకు తరలిస్తున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో పెనుగొలను ఆర్.సి.ఎం చర్చి ఎదురుగా విద్యుత్ తీగలు ప్రయాణిస్తున్న సుబాబుల్ లోడు లారీకి తగలడంతో అహ్మద్ అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎస్ఐ శ్రీనివాస్ సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టంకు పంపనున్నట్లు వివరించారు.

మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

మురుగునీటి సమస్యపై వినతి

ప్రజాశక్తి - అజిత్ సింగ్ నగర్ :

సింగ్‌నగర్ తదితర ప్రాంతాల్లో కొద్ది రోజులుగా ఉదయం పూట కలుషితమైన మురికి నీరు వస్తున్నాయని ఈ సమస్యను పరిష్కరించాలని సిపిఐ నగర కార్యదర్శి వర్గ సభ్యులు కె.వి.భాస్కరరావు వాటర్ సప్లై ఎఇ అరుణ దేవ్ కుమార్‌కు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం పాడవుతుందని డయేరియా వచ్చే ప్రమాదం ఉందని, ఉదయం పూట ఇచ్చే 30 నిమిషాలు నీరు సరిపోవటం లేదని ఇంకా 15 నిమిషాలు పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో నగర కార్యవర్గ సభ్యులు లింగ బత్తుల శివకుమార్ కంది ఆదినారాయణ సిహెచ్.గురవయ్య, పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల నివారణకు కృషి

విజయవాడ : గవర్నరుపేటలోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన గ్రంథాలయ అధికారిణి కే.రమాదేవి మాట్లాడుతూ 'ప్రపంచవ్యాప్తంగా ది యునైటెడ్ నేషన్స్ ఆఫీస్ ఆన్ డ్రగ్స్ అండ్ క్రైమ్ (యుఎన్‌ఒడిసి) మత్తు పదార్థాల వల్ల ఏర్పడే సమస్యల పట్ల చైతన్యం కోసం అనేక అవగాహన కార్యక్రమాలను చేపట్టిందన్నారు. మన దేశంలో నషా ముక్త్ భారత్ అభియాన్ ద్వారా మాదక ద్రవ్యాల వల్ల కలిగే దుష్ప్రభావం వంటి వాటిని నివారించటానికి అనేక ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తుంది అని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థుల చేత మాదక రహిత సమాజం కోసం కృషి చేస్తానని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, పాఠకులు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం

పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...

మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218

విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.